RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 362 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | శనివారం | ఏప్రిల్ | 4 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

## తెలంగాణలో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు

నిజామాబాద్,ఏప్రిల్, 3: తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంట కు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడవచ్చని, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



## ఇరాన్‌లోని ఐకానిక్ బ్రిడ్జి ధ్వంసం

**అమెరికా, ఇజ్రాయెల్ భీకరదాడి**

- ఆలస్యం కాకముందే ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్ హెచ్చరిక
- జోర్డాన్‌లో అమెరికా ఫైటర్‌జెట్లపై డ్రోన్లతో విరుచుకుపడ్డ ఇరాన్

వాషింగ్టన్ : పశ్చిమాసియాలో నిర్మాణంలో ఉన్న అతి ఎత్తయిన వంతెనను యూఎస్-ఇజ్రాయెల్ వైమానిక దళాలు దాడి చేసి కూల్చివేశాయి. ఇలాంటి దాడులు మరిన్ని తప్పవని హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంటల్లో ఉన్న కూలిన బ్రిడ్జి వీడియోను ట్రూత్ సోషల్‌లో ఉంచారు. ఆలస్యం కాకముందే తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ దాడిలో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ పశ్చిమం నుంచి కారజ్ నగరాన్ని కలిపే ఈ బ్రిడ్జి ఎత్తు 136 మీటర్లు. పశ్చిమాసియాలో ఇంజినీరింగ్ అద్భుతంగా దీన్ని పేర్కొనేవారు. ఇరాన్ ప్రతీకార దాడులు: జోర్డాన్‌లోని అల్ అజ్రాక్ స్థావరంలోని అమెరికా ఫైటర్ జెట్లపై తాము డ్రోన్ దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. జోర్డాన్ బేస్‌లో అమెరికా విమానాలు నిలిపి ఉంచగా ఈ దాడి జరిగింది. అయితే విమానాలకు ఎంత నష్టం వాటిల్లినదీ వివరాలు తెలియరాలేదు. గల్ఫ్‌లో పౌర మౌలిక సదుపాయాలు లక్ష్యంగా తమ దాడులు కొనసాగినట్టు పేర్కొన్నది.



## యూడీఎఫ్ మేనిఫెస్టోతో కేరళకు స్వర్ణయుగం

**సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్,: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా గడిపారు. తిరువనంతపురంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఎన్నికల మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో కేరళ రాష్ట్రానికి ఒక "స్వర్ణయుగానికి నాంది" పలుకుతుందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... యూడీఎఫ్ అధికారంలోకి వస్తే కేరళ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తోందో, కేరళలోనూ అదే తరహా అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. యూడీఎఫ్ మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు. 'న్యాయ్' పథకం కింద పేద కుటుంబాలకు నేరుగా ఆర్థిక సాయం, సామాజిక భద్రతా పెన్షన్ల పెంపు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన వంటి కీలక హామీలను పొందుపరిచారు. వీటితో పాటు వ్యవసాయ రంగంలో సంస్కరణలు, మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి కేరళలోని ప్రస్తుత ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కేరళ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, యూడీఎఫ్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేరళలో కాంగ్రెస్ గెలుపు దేశవ్యాప్తంగా లౌకిక శక్తులకు మరింత బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.



## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీపై వేటు

**ఎప్‌స్టీన్ వ్యవహారంలో సరిగ్గా వ్యవహరించలేదన్న ఆరోపణ**

వాషింగ్టన్, ఏప్రిల్3 :యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబంధించిన దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి. పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి. మార్చి5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పొరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను అమెరికా న్యాయవ్యవస్థ డోజ్ జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి.



## గ్రూప్-1 నియామకాలపై సుప్రీంకోర్టు తీర్పుపై సీఎం రేవంత్ స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 3: తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ -1అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు.



## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

**భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక**

ఇస్లామాబాద్, ఏప్రిల్3 :పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరిసెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.



## తమిళనాడు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల..

**27 మంది అభ్యర్థుల పేర్లు ఖరారు**

తమిళనాడు : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. మొత్తం 27 మందితో కూడిన జాబితాను శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఇందులో తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు లేకపోవడం విశేషం. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. మైలపోర్ నుంచి, కేంద్ర మంత్రి ఎల్ మురుగన్.. అవనాషి స్థానం నుంచి పోటీ చేయబోతున్నారు. అలాగే, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్.. సత్తూర్ స్థానం నుంచి పోటీ చేయబోతున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఎన్డీయే కూటమిగా పోటీ చేయబోతుంది. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో ఎన్డీయే కూటమి తరఫున ఏఐఏడీఎంకే పార్టీ 169 స్థానాల్లో పోటీ చేయబోతుంది. బీజేపీ 27 స్థానాల్లో, అన్బుమణి రామదాస్ ఆధ్వర్యంలోని పీఎంకే పార్టీ 18 స్థానాల్లో, టీటీవీ దినకరన్ స్థాపించిన ఏఎంఎంకే పార్టీ 11 స్థానాల్లో పోటీ చేయబోతుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. మే 4న ఫలితాలు వెల్లడవుతాయి. ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగుస్తుంది. మరోవైపు అధికార డీఎంకే కూడా సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఎస్పీఏ) పేరుతో కూటమిగా పోటీ చేస్తోంది.




## దొడ్డి కొమురయ్యకు కెసిఆర్ నివాళి

హైదరాబాద్, ఏప్రిల్3: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలిఅమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్ఫూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్ల పాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు. తమ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజకీయ హక్కుల కోసం తెలంగాణ సబ్బండ కులాల పోరాటాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగ పరమైన హక్కులను అందించగలిగిన నాడే, దొడ్డి కొమరయ్య వంటి ఎందరో తెలంగాణ అమరులు, త్యాగధనులకు నిజమైన ఘన నివాళి అర్పించినట్లవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.



## బెంగాల్ లో కాంగ్రెస్ ఒంటరి పోరు

కోల్ కత్తా, : పశ్చిమ బెంగాల్ రాజకీయ ముఖచిత్రం ఎన్నికల వేళ మరింత ఆసక్తికరంగా మారుతోంది. త్వరలో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్ ఒక కీలకమైన నిర్ణయం తీసుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య ప్రధానంగా పోరు నెలకొన్న ఈ రాష్ట్రంలో.. మొత్తం 294 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా సొంతంగా అభ్యర్థులను బరిలోకి దించాలని కాంగ్రెస్ అధిష్ఠానం అధికారికంగా తీర్మానించింది.అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాల ఖరారుపై ఢిల్లీలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. ఈ అత్యున్నత స్థాయి భేటీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ సహా పలువురు ముఖ్య సీనియర్ నాయకులు పాల్గొన్నారు. బెంగాల్‌లోనిక్షేత్రస్థాయి పరిస్థితులు, అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అవకాశాలపై నాయకులు కూలంకషంగా చర్చించారు.కాంగ్రెస్ పార్టీ తాజా నిర్ణయంతో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఒంటరిగా పోటీ చేయాలన్న నిర్ణయానికి ఆశావహుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఏఐసీసీ పశ్చిమ బెంగాల్ ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. "మా పార్టీ రాష్ట్రంలోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాల్లోనూ పూర్తి స్థాయిలో పోటీ చేస్తుంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణుల నుంచి ఏకంగా 2,500 మంది ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు.




## పాకిస్థాన్‌లో పెట్రో మంట లీటర్ డీజిల్ రూ. 520

పాకిస్థాన్: పొరుగు దేశం పాకిస్థాన్‌లో ఇంధన ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రజలపై అక్కడి ప్రభుత్వం పెట్రో భారం మోపింది. పెట్రోల్, డీజిల్ ధరలను రికార్డు స్థాయిలో పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు శుక్రవారం, ఏప్రిల్ 3 నుంచి తక్షణమే అమల్లోకి వచ్చాయి. తాజా పెంపుతో లీటర్ హై-స్పీడ్ డీజిల్ ధర ఏకంగా రూ. 184.49 (54.9 శాతం) పెరిగి రూ. 520.35కు చేరింది. అదేవిధంగా, పెట్రోల్ ధర లీటర్‌పై రూ. 137.23 (42.7 శాతం) పెరిగి రూ. 458.40కు ఎగబాకింది. నెల రోజుల వ్యవధిలో పాకిస్థాన్‌లో ఇంధన ధరలు పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయని,
ఈ భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయక తప్పడం లేదని పాక్ ప్రభుత్వం తెలిపింది.
ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్, పెట్రోలియం శాఖ మంత్రి అలీ పర్వైజ్ మాలిక్ గురువారం రాత్రి మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. "అంతర్జాతీయ ధరల భారాన్ని వినియోగదారులకు బదిలీ చేయక తప్పదు, అయితే బలహీన వర్గాలపై ప్రభావాన్ని తగ్గించడానికి ఉపశమన చర్యలను తీసుకుంటాము" అని ఆర్థిక మంత్రి ఔరంగజేబ్ పేర్కొన్నారు. భారీ పెంపు నుంచి సామాన్యులకు కొంత ఊరట కల్పించేందుకు ప్రభుత్వం లక్షిత సబ్సిడీలను ప్రకటించింది. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనదారులకు మూడు నెలల పాటు నెలకు 20 లీటర్ల వరకు లీటర్‌పై రూ. 100 సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపింది. దీంతో పాటు చిన్న రైతులు, ప్రజా రవాణా వాహనాలకు కూడా ఉపశమన చర్యలు ప్రకటించింది.

# బాలుర వసతి గృహానికి ఎదురుగా స్మశాన వాటిక తగదు

## - స్మశాన వాటిక పరిసరాలలో చెట్ల తొలగింపు - పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్


మహానది
Mahanadi E-Paper
21 Apr 2024 - Page 3

మహానది

**కాష్టాలగడ్డ... కష్టాలు తీరేదెన్నడు?**

**-ప్రభుత్వం కరుణించాలని గ్రామస్థుల విజ్ఞప్తి**

మహనది న్యూస్,బయ్యారం :ఏప్రిల్ 20 : బయ్యారం మండల కేంద్రంలోని ఎస్సి బాలుర వసతి గృహానికి పది మీటర్ల దూరంలో కొన్ని దశాబ్దాలుగా ఉన్న స్మశాన వాటిక స్థలం కేవలం ఐదు నుండి ఆరు గుంటల విస్తీర్ణంలో ఉంది. బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీ రెండు భాగాలుగా అంటే రంగాపురం, బయ్యారం గా ఉంటుంది. మొత్తం జనాభా ఆరు వేల ఆరు వందల ఇరవై ఏడు ఉండటం, విస్తీర్ణంలో పెద్దదిగా ఉండటం వలన ఇటీవల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఒక స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. అది కూడా ఊరికి చాలా దూరంలో ఉంటుంది. దాదాపుగా కొంతమంది రంగాపురం వాస్తవ్యులు మాత్రమే దానిని వినియోగించుకోవడం జరుగుతుంది. బయ్యారం స్మశాన వాటిక చాలా తక్కువ విస్తీర్ణంలో ఉండటం మూలంగా దశాబ్దాల తరబడి కాలం చేసిన వారిని వారి సంప్రదాయ ప్రకారం కొంతమంది ఖననం చేసే ప్రక్రియను చేస్తారు. ఈ క్రమంలో స్థలాభావ పరిస్థితుల వలన ఖననం చేసిన వారి స్థానంలో మరొకరిని చెయ్యాల్సిన దౌర్భాగ్యం నెలకొంది. ఈ క్రమంలో పాత ఆస్థికలను తీసి గుంట చేసి మరొకరి పార్థీవ దేహాన్ని పూడ్చాల్సి వస్తుంది. కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. పైగా బాలుర వసతి గృహానికి అతి సమీపంలో ఉండటం వల్ల విద్యార్థులు కొన్ని సందర్భాలలో భయానికి లోనవుతున్నారు. ఆ స్మశాన స్థలం వైశాల్యం గతంలో చాలా ఉండేదని, క్రమ క్రమంగా ఆక్రమణకు గురి కావడం జరిగిందని గ్రామస్థుల నుండి తెలిసిన సమాచారం. ఊరికి దూరంగా ప్రభుత్వ భూములు ఉన్నాయని కూడా చర్చ సాగుతోంది, అటువంటప్పుడు అలాంటి ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్మశాన స్థలాన్ని మార్చాలని కూడా వారి నుండి వస్తున్న డిమాండ్. ఖననంకి బదులు దహనం చెయ్యాల్సి వస్తే మండుతున్న కాష్టం నుండి వస్తున్న దుర్వాసన కూత వేటు దూరంలో ఉన్న వసతి గృహంకి,హరిజన వాడకు వ్యాపించి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ శాశ్వతంగా విశ్రమించే శ్మశానంలో మాత్రం ఎలాంటి వ్యత్యాసం ఉండదు. కొందరు ఖననం చేస్తే మరికొందరు దహనం చేస్తారు ఇవే తేడాలు. బతికి ఉన్నప్పుడు ఎలాగూ సుఖపడలేదు చచ్చిన తర్వాత అయినా సుఖపడు అంటారు కానీ అలాంటి పరిస్థితి లేదు ప్రస్తుత తరుణంలో. కొంతమంది స్మశాన వాటికలను సైతం కబ్జా చేసేస్తున్నారు.దీంతో ఆరడుగుల స్థలం కోసం నానా పాట్లు పడని పరిస్థితి నేటికి ఉందని చెప్పడం దురదృష్టకరం. తక్షణమే సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూమిలో దహన సంస్కారాలకు అవకాశం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



**బయ్యారం,మహానది న్యూస్, ఏప్రిల్ 03:** బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలోని దళితవాడ వద్ద గల స్మశాన వాటిక పూర్తిగా చెట్లతో నిండిపోయిన అంశాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజపాలన –ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక లో భాగంగా గ్రామసభ లో గ్రామప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులో భాగంగా బయ్యారం లోని స్మశాన వాటికను గౌరవ సర్పంచ్ గుగులోత్ శాంతి, కిషన్ నాయక్ బయ్యారం మండలం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ , బయ్యారం గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ తహసీల్దార్ నాగరాజు అనుమతితో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ వెంటనే జేసీబీ ని పంపి చెట్లను తొలగిస్తూ జరుగుతున్న పనిని పర్యవేక్షణ చేయడం జరిగింది. గతంలో మహానది దిన పత్రిక బయ్యారం ప్రతినిధి "నా వల్ల కాదు అంటున్న కష్టాల గడ్డ" "కాష్టాల గడ్డ ..కష్టాలు తీరేదెన్నడు..?" అనే శీర్షికలతో పలు మార్లు వార్తల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకొని రావడం జరిగింది.

**ప్రభుత్వ యంత్రాంగం స్పందిస్తున్నందుకు ధన్యవాదాలు...**

### స్మశాన వాటిక స్థల మార్పు అనివార్యం

బయ్యారం మండల కేంద్రంలోని ఎస్సి బాలుర వసతి గృహానికి పది మీటర్ల దూరంలో కొన్ని దశాబ్దాలుగా ఉన్న స్మశాన వాటిక స్థలం కేవలం ఐదు నుండి ఆరు గుంటల విస్తీర్ణంలో ఉంది. బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీ రెండు భాగాలుగా అంటే రంగాపురం, బయ్యారం గా ఉంటుంది. మొత్తం జనాభా ఆరు వేల ఆరు వందల ఇరవై ఏడు ఉండటం, విస్తీర్ణంలో పెద్దదిగా ఉండటం వలన ఇటీవల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఒక స్మశాన వాటికను ఏర్పాటు చేశారు. అది కూడా ఊరికి చాలా దూరంలో ఉంటుంది. దాదాపుగా కొంతమంది రంగాపురం వాస్తవ్యులు మాత్రమే దానిని వినియోగించుకోవడం జరుగుతుంది. బయ్యారం స్మశా న వాటిక చాలా తక్కువ విస్తీర్ణం లో ఉండటం మూలంగా దశా బ్దాల తరబడి కాలం చేసిన వా రిని వారి సంప్రదాయ ప్రకారం కొంతమంది ఖననం చేసే ప్ర క్రియను చేస్తారు. ఈ క్రమంలో స్థలాభావ పరిస్థితుల వలన ఖననం చేసిన వారి స్థానంలో మరొకరిని చెయ్యాల్సిన దౌ ర్భాగ్యం నెలకొంది. ఈ క్రమం లో పాత ఆర్థికలను తీసి గుంట చేసి మరొకరి పార్థీవ దేహాన్ని పూడ్చాల్సి వస్తుంది. కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. పైగా బాలుర వసతి గృహానికి అతి సమీపంలో ఉ ండటం వల్ల విద్యార్థులు కొన్ని సందర్భాలలో భయానికి లోనవుతున్నారు. ఆ స్మశాన స్థలం వైశాల్యం గతంలో చాలా ఉండేదని, క్రమ క్రమంగా ఆక్రమణకు గురి కావడం జరిగిందని గ్రామస్థుల నుండి తెలిసిన సమాచారం. ఊరికి దూరంగా ప్రభుత్వ భూములు ఉన్నాయని కూడా చర్చ సాగుతోంది, అటువంటప్పుడు అలాంటి ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్మశాన స్థలాన్ని మార్చాలని కూడా వారి నుండి వస్తున్న డిమాండ్. ఖననంకి బదులు దహనం చెయ్యాల్సి వస్తే మండుతున్న కాష్టం నుండి వస్తున్న దుర్వాసన కూత వేటు దూరంలో ఉన్న వసతి గృహంకి,హరిజన వాడకు వ్యాపించి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ శాశ్వతంగా విశ్రమించే శ్మశానంలో మాత్రంఎలాంటి వ్యత్యాసం ఉండదు. కొందరు ఖననం చేస్తే మరికొం దరు దహనం చేస్తారు ఇవే తేడాలు. బతికి ఉన్నప్పుడు ఎలాగూ సుఖప డలేదు చచ్చిన తర్వాత అయినా సుఖపడు అంటారు కానీ అలాంటి పరిస్థితిలేదు ప్రస్తుత తరుణంలో. కొంతమంది స్మశాన వాటికలను సైతంకబ్జా చేసేస్తున్నారు. దీంతో ఆరడుగుల స్థలం కోసం నానా పాట్లు పడని పరిస్థితి నేటికి ఉందని చెప్పడం దురదృష్టకరం. తక్షణమే సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూమిలో దహన సంస్కారాలకు అవకాశం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



# 5న యువ జైన మునుల 'మహా శతావధాన్'



హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 03: నగరానికి చెందిన యువ జైన సాధువులు తమ జ్ఞాపక శక్తితో ప్రపంచాన్ని అబ్బుర పరచనున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 200 ప్రశ్నలకు వారు తడుముకోకుండా బదులివ్వనున్నారు. ఈ నెల 5వ తేదీ ఆదివారం హైదరాబాద్, బాగ్ లింగంపల్లి, టీఎస్ఆర్టీసీ కళ్యాణ మండపంలో యువ జైన మునులచే అద్భుతమైన 'మహా శతావధాన్' ప్రదర్శన జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ట్రస్టీ యోగేష్ గాంధీ వెల్లడించారు. మానవ కళ్యాణ్, యువతకు ప్రేరణ కలిగించేందుకు ఏర్పాటు చేసిన ఈ 'మహాశతావధాన్' కార్యక్రమం ఆదివారం ఉదయం 8.00 నుండి సాయంత్రం వరకు కొనసాగుతుందని, భక్తులకు ఉచిత ప్రవేశం కల్పించామని, యువతీ యువకులతోపాటు ఆధ్యాత్మిక నాయకులు, పారిశ్రామికవేత్తలు, పండితులు, వ్యాపారవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు సమాజంలోని అన్ని రంగాలకు చెందిన ఇతర ప్రముఖులు ఈ అద్భుతమైన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అవధానంలో ప్రావీణ్యం సంపాదించిన యువ జైన మునులు నమీచంద్రసాగర్ జీ, నేమిచంద్రసాగర్ జీ, సుపార్శ్వ చంద్రసాగర్ జీలు ఈ 'మహా శతావధాన్' కార్యక్రమంలో అవధాన ప్రక్రియలో భాగంగా రకరకాల అంశాలపై భక్తులు అడిగిన 200 ప్రశ్నలకు అడిగిన క్రమంలోనే బదులివ్వనున్నారని తెలిపారు. ప్రజలందరూ 'మహా శతావధాన్' ప్రదర్శన లో పాల్గొని విజయవంతం చేయాలనీ యోగేష్ గాంధీ విజ్ఞప్తి చేసారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యువ జైన మునులు ఆచార్య నాయచంద్రసాగర్ సూరి జీ శిష్యుడైన మహా శతావధాని అభినందన్చ ంద్రసాగర్ జీ శిష్యులైన నమీ చంద్రసాగర్ జీ, నేమి చంద్రసాగర్ జీ అనే కవల సన్యాసులు, సుపార్శ్వ చంద్రసాగర్ ముని, జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ట్రస్టీలు కైలాష్ బండారి, సీఏ విక్రమ్ శ్రీశ్రీమల్, అమిత్ వజవత్, హితేష్ జి ముథ, అంకిత్ చోరాదియా మాట్లాడారు.

సుపార్శ్వ చంద్రసాగర్ ముని మాట్లాడుతూ అన్ని ప్రాచీన కళారూపాలలో, ఆధ్యాత్మిక/అతీంద్రియ శక్తి విషయంలో మన దేశానికే ఏకస్వామ్యం ఉందని, ధ్యాన మార్గంలో ఉన్న వ్యక్తి అద్భుతమైన అతీంద్రియ శక్తులను పొందుతాడని, అటువంటి జ్ఞాపకశక్తి శక్తులలో 'మహా శతావధాన్' ఒకటని, దీనిలో, నిశితమైన ధ్యానం ద్వారా ఒక వ్యక్తి 200 రకాల ప్రశ్నలను లేదా విషయాలను ఒక్కసారి మాత్రమే వింటాడు, కానీ అడిగినప్పుడు వాటన్నింటినీ కాలక్రమానుసారంగా, యాదృచ్ఛికంగా గుర్తుచేసుకొని సమాధానం చెపుతాడని తెలిపారు. కవల సన్యాసులు నమీచంద్రసాగర్ జి, నేమిచంద్రసాగర్ జీ మాట్లాడుతూ సాధువులు శతావధానిగా మారడం అరుదైన విషయమని, ఇందుకోసం కఠోర సాధన అవసరమన్నారు.

శతావధానం అనేది మతపరమైనది కాదని, అది ఒక అతీంద్రియ స్మృతి అని, సంగీతం, కళలు హిస్టరీ, సైన్స్, సోషల్, టెక్నాలజీ, పొలిటికల్ తదితర ఏవిషయాలైన భక్తులు అడిగిన ప్రశ్నలకు నిశ్శబ్దం, ధ్యానం, ఏకాగ్రత ద్వారా జ్ఞాపక శక్తిని గుర్తుకు తెచ్చుకొని సమాదానాలు చెపుతామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ప్రతినిధులు ఆకాష్ గురూజీ, అక్షత్ జైనం, రిషబ్, అక్షిత్, ఆర్యన్ జైనం, ప్రానం తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్ మెంట్ పథకం రద్దుకు ప్రభుత్వం కుట్ర

## - జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



**హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 03:** ఫీజు రియంబర్స్మెంట్ పథకం రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆరోపించారు. ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పోరాట ఫలితంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కోర్టుకు వెళ్లాయని తెలిపారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించపోతే కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుండే ఫీజులు వసూలు చేసుకోవచ్చు అని హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. హైకోర్టు తీర్పుతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజుల రియంబర్స్ మెంట్ నిదుల విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి బీసీ విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని అమలు చేయకపోతే బీసీ మంత్రులు రాజీనామా చేసి బీసీ విద్యార్థులకు అండగా ఉండాలని ఆయన కోరారు.

## వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థ ఆధ్వర్యంలో...

# పేదలకు దుప్పట్ల పంపిణీ



హైదరాబాద్, మహానది న్యూస్,ఏప్రిల్ 3 : వరల్డ్ వైస్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ సంస్థ స్టేట్ చైర్మన్ తెలంగాణ మట్ట నాగరాజు ఆధ్వర్యంలోగాంధీ ఆసుపత్రి ఎంసి హెచ్ బిల్డింగ్ వద్ద సంస్థ నేషనల్ ఫౌండర్ చైర్మన్ డా ఎస్ రామానుజ స్వామి హైదరాబాద్ విచ్చేసిన సందర్భంగా పేదలకు బ్రేడ్ పాకెట్స్, బన్స్,బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న జిల్లా నాయకులకు, సభ్యులకు గుర్తింపు కార్డులు సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ సంస్థ వినియోగదారుల హక్కులను కాపాడటానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అవసరమైన వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ.. పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. చక్కటి కార్యక్రమాలు తెలంగాణ చైర్మన్ మట్ట నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. మట్ట నాగరాజు మాట్లాడుతూ.. ఇటీవల బ్లైండ్ హాస్టల్లో వారికి పోషకాహారాన్ని పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. నేషనల్ చైర్మన్ ఫౌండర్ డాక్టర్ ఎస్ రామానుజ స్వామి పిలుపు మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వైస్ చైర్మన్ లక్ష్మి నారాయణ, కామరాజు, విజయ్ రెడ్డి , ఆసుపత్రి సిబ్బంది అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జై స్వరాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఇన్చార్జిగా భీమ్ రాజ్



**హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 03:** రంగారెడ్డి జిల్లా జై స్వరాజ్ పార్టీ ఇంచార్జిగా మలికి భీమ్ రాజ్ ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ నియమించారు. హైదరాబాద్లో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో భీమ్ రాజ్ ను జై స్వరాజ్ పార్టీలోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. భీమ్ రాజ్ కు రంగారెడ్డి జిల్లాలో ఉన్న పరిచయాలతో పాటు గత రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. నియమిత కాలంలో జిల్లాలోని అన్ని మండల పార్టీ కమిటీలు వేయడంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ కార్యాచరణ చేపట్టాలని కేఎస్ఆర్ గౌడ ఈ సందర్భంగా భీమ్ రాజ్ ను ఆదేశించారు. ఇదే క్రమంలో జిల్లా కమిటీని ప్రకటిస్తామని ఆయన చెప్పారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం ఎట్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన భీమ్ రాజ్ జై స్వరాజ్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు . ఈ సందర్భంగా భీమ్ రాజ్ మాట్లాడుతూ తనకు పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ఇచ్చిన బాధ్యతలు నిర్వహిస్తూ, జిల్లాలో పార్టీ నిర్మాణ కార్యక్రమాలు చేడుతానని అన్నారు. పార్టీ నియమాలు పాటించడంతో పాటు క్రమ శిక్షణతో ఉంటానని ఆయన తెలిపారు.

తక్షణమే పార్టీ నిర్మాణ కార్యక్రమాలు చేపడుతానని పార్టీ అధినేతతో భీమ్ రాజ్ అన్నారు. అలాగే తనకు జిల్లా ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వడంలో సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు..

వాషింగ్టన్, : ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది. సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు.

# సంపాదకీయం


## చెంపదెబ్బ...గోడదెబ్బ !

దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి.ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది. కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమకి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది. ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదవైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదా రీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధిం చాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరి ణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్ధరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయ డం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.

# ఎమ్మెల్యే పనితీరుపైనా చంద్రబాబు సర్వే!

విజయవాడ, : ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వన్ టూ వన్ భేటీల తర్వాత ఎమ్మెల్యే పనితీరు మెరుగైందని చంద్రబాబు అన్నారు. 37 మంది శాసనసభ్యులు మినహా మిగతా అందరి పనితీరు మెరుగుపడిందని.. ఓ 37మంది ఎమ్మెల్యేల పనితీరు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపైనా సర్వే నివేదికలు తెప్పించుకుం టున్నానన్న చంద్రబాబు.. పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. బీజేపీ కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఎలా నిస్వార్థంగా పనిచేస్తేందో.. అదే తరహాలో ఓ సిద్ధాంతం ప్రకారం పార్టీ క్యాడర్‌ను సంసిద్ధం చేసుకోవాలని నేతలకు సూచించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరుపైనా చంద్రబాబు చర్చించారు. వైఎస్ జగన్ అర్థం పర్థం లేకుండా మాట్లాడే మాటలు పట్టించుకోవద్దని సూచించారు. విజ్ఞత కోల్పోయి మాట్లాడుతున్న మాటలకు విలువ లేదన్న చంద్రబాబు.. ప్రజలే వారికి బుద్ధి చెబుతారని అన్నారు. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా సీఎం చంద్రబాబు తిరుమల పరకామణి కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పరకామణిలో రూ.70వేల చోరీ చేసి.. రూ.14కోట్ల ఆస్తి రాసిచ్చేందుకు సిద్ధమయ్యారంటే ఎంత సంపాదించి ఉండొచ్చని చంద్రబాబు ప్రశ్నించారు. పరకామణి కేసులో వైఎస్ జగన్ శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని చంద్రబాబు విమర్శించారు, వైఎస్ జగన్‌కు దేవుడు అన్నా, భక్తుల మనోభావాలు అన్నా పట్టింపులేదని.. దొంగతనాన్ని కూడా తప్పు కాదనే వాళ్లను ఏమనాలని చంద్రబాబు ప్రశ్నించారు. నేరస్తుల్ని వెనకేసుకొస్తూ సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని మండిపడ్డారు. తిరుమల శ్రీవారి భక్తులు, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని చంద్రబాబు అన్నారు.మరోవైపు ఏపీలో లేడీ డాన్ల వ్యవహారం చర్చనీయాంశమవుతున్న వేళ చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరులో అరుణ, అరవ కామాక్షి వ్యవహారం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లేడీ డాన్ల విషయంపై చంద్రబాబు మీడియాతో చిట్ చాట్ సందర్భంగా స్పందించారు. వైసీపీ హయాంలో నెల్లూరులో మాఫియా చాపకింద నీరులా విస్తరించిందని ఆరోపించారు. లేడీ డాన్లు తయారు కావటం ఆశ్చర్యమేసిందన్న చంద్రబాబు..నేరాలకు పాల్పడే వారి తోకలు కట్ చేస్తామని హెచ్చరించారు.అమరావతిలో సమస్యలు పరిష్కారమై ప్రశాంతంగా ఉంటే.. కొంతమంది తట్టుకోలేకపోతున్నారన్న చంద్రబాబు... రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇక టీడీపీ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్న వాస్తవాన్ని తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీలు కూడా గుర్తిస్తున్నాయన్న చంద్రబాబు.. పరోక్షంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఏపీలో జోనల్ వ్యవస్థ: ఏపీ సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేకంగా జోన్ వ్యవస్థను తీసుకొస్తామని చెబుతున్నారు. బాబు నో మూడు జోన్లు అన్న మాట రావడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. గతంలో వైసీపీ తెచ్చిన మూడు రాజధానుల ఫార్ములాకు కౌంటర్‌గానే జోన్ స్లోగన్ అందుకున్నారన్న టాక్ వినిపిస్తోంది.మళ్లీ ఫ్యూచర్‌లో కూడా ఆర్థిక, న్యాయ, పరిపాలనా రాజధాని అని లేనిపోని రచ్చ లేకుండా..డెవలప్‌మెంట్ మోడల్‌తో జోన్ సిస్టమ్‌కు ప్రపోజల్ రెడీ చేస్తున్నారట. అభివృద్ధి కోసమే జోన్ వ్యవస్థ అని బాబు చెప్తున్నప్పటికీ..వైసీపీని పూర్తిగా కార్నర్ చేయడానికే అన్న చర్చ అయితే జరుగుతోంది. అయితే మూడు ప్రాంతాలను మూడు జోన్లుగా చేసి..స్పెషల్ బోర్డు..స్పెషల్ ఆఫీసర్లను కూడా పెట్టేందుకు అంతా సిద్ధమవుతోందట. అభివృద్ధి పనులు, పెట్టుబడులు, ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ.. ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఇంప్లిమెంట్ అయ్యేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. విశాఖ, అమరావతి, రాయలసీమను ఆర్థిక జోన్లుగా డివైడ్ చేసి..ప్రతీ జోన్‌కు మూడు కమిటీలు ఉండేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. విశాఖ జోన్‌లోకి ఉత్తరాంధ్రలోని 9 జిల్లాలు.. అమరావతి జోన్‌లోకి 8 జిల్లాలు, రాయలసీమ జోన్‌లోకి 9 జిల్లాలు రాబోతున్నాయి. రాయలసీమ జోన్‌కు తిరుపతి కేంద్రంగా ఉ ండబోతోంది. మూడు ఎకనామిక్ జోన్లకు కలిపి సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఓ స్టీరింగ్ కమిటీ కూడా ఉండేలా వ్యూహరచన చేస్తున్నారట.అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకూడదనేదే తమ ఆలోచన అంటున్నారు చంద్రబాబు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రకటించారు. రీజనల్ బోర్డులతో అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు. ఏపీలో గతంలో ఉన్న 13 జోన్ల వ్యవస్థను మార్చి, మూడు ప్రధాన జోన్లుగా చేయాలనే ప్రతిపాదన చర్చలో ఉంది. 2024 ఎన్నికల్లో టీడీపీ మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని ప్రస్తావించారుఇప్పుడు అమల్లోకి తెచ్చే ప్లాన్ చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జోన్‌లో పోర్టులు, టూరిజం, ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ చేయనున్నారట. కోస్తా జోన్‌లో రాజధాని అమరావతి అభివృద్ధి, అగ్రికల్చర్, ఎ హబ్‌లు వంటి అంశాలు కీలకంగా కానున్నాయి. రాయలసీమ జోన్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్‌తో పాటు ప్రాజెక్టులు, ఇన్వెస్ట్‌మెంట్లను అట్రాక్ట్ చేసే వ్యూహం ఉందట. ప్రతి జోన్‌కు సెపరేట్ బడ్జెట్, మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామంటోంది సర్కార్.పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసేలా రీజనల్ బోర్డులపై టైమ్ చూసి లీకులు ఇచ్చారని అంటున్నారు. వైసీపీ మూడు రాజధానుల ఫార్ములా ఎలాగూ సక్సెస్ కాలేదు. కానీ కూటమి ప్రభుత్వం అమరావతి కేంద్రంగానే అభివృద్ధి చేస్తోందన్న విమర్శ ఉంది. అందుకే చంద్రబాబు రీజనల్ బోర్డుల ఏర్పాటుకు ప్లాన్ చేశారని అంటున్నారు. వైసీపీ మూడు రాజధానుల ఎజెండాకు కౌంటర్‌గా..జోన్ నినాదం ఎత్తుకున్నారని చెప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో డెవలప్‌మెంట్‌ను స్పీడప్ చేశారు.రాజధాని పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అయితే అమరావతి రాజధాని అభివృద్ధి చేస్తూనే ఏపీలో మూడు ప్రాంతాల ఈక్వల్‌గా డెవలప్‌చేయాలన్న స్టాండ్‌తో బాబు ముందుకు రావడం హాట్ టాపిక్ అవుతోంది.ఏపీలో అమరావతిని మాత్రమే అభివృద్ధి చేసి మిగిలిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వైసీపీ విమర్శలు చేయకుండా.. అపోజిషన్‌కు అసలు చాన్సే ఇవ్వొద్దన్న ఆలోచనతో బాబు ఉన్నారట. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి..పెట్టుబడులు..ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధి వికేంద్రీకరణ అన్నట్లుగా రీజనల్ బోర్డులను తెస్తున్నారట. బాబు చెబుతున్న మూడు జోన్ల నినాదం ఏపీ రూపురేఖలను మారుస్తుందా లేదా అనేది వేచి చూడాలి.


# రూ.7 లక్షల కోట్లు ఆవిరి



- దలాల్ స్ట్రీట్‌కు ఎఫ్ఐఐ సెగలు
- సెన్సెక్స్ 600 పాయింట్ల పతనం
- ఇండిగో షేర్ల కుదేలు

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ మదుపర్లు ముఖం చాటేస్తోన్నారు. వరుస అమ్మకాలతో దలాల్ స్ట్రీట్‌కు సెగలు పుట్టిస్తున్నారు. రూపాయి రికార్డ్ పతనం, భారత్ %-% అమెరికా వాణిజ్య ఒప్పందంపై సానుకూల సంకేతాలు కానరాకపోవడం, విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) అమ్మకాలతో సోమవారం సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలాయి. బిఎస్ఇ సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కొనసాగి.. తుదకు 610 పాయింట్లు లేదా 0.71 శాతం పతనమై 85,103కు పరిమితమైంది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 226 పాయింట్లు లేదా 0.86 శాతం కోల్పోయి 25,961 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్లకు పైగా నష్టపోయింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.7 లక్షల కోట్లపైగా ఆవిరై రూ.463 లక్షల కోట్లకు తగ్గింది. దీంతో ఒక్కపూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.7 లక్షల కోట్లు కరిగిపోయినట్లయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డిఎఫ్‌సి మినహా మిగిలిన 27 షేర్లూ ప్రతికూలతను చవిచూశాయి. బిఇఎల్, ఎటెర్నెల్, ట్రెంట్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ స్టాక్స్ అధికంగా నష్టపోయాయి. యుఎస్ ఫెడ్ ఈ నెల 10న వడ్డీ రేట్లను తగ్గించ నుందనే అంచనాలతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి శుక్రవారం ఒక్క పూటలోనే రూ.439 కోట్లను ఉపసంహరించుకోగా.. డిసెంబర్‌లో ఇప్పటివరకు రూ.6,584 కోట్ల విలువైన స్టాక్స్‌ను తరలించుకుపోయారు. ఇది మార్కెట్లపై మరింత ఒత్తిడిని పెంచిందని నిపుణులు భావిస్తున్నారు. ఇండిగోలో నెలకొన్న సంక్షోభంతో దాని మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ మార్కెట్లలో భారీగా క్షీణించాయి. ఇప్పటికే గత ఐదు సెషన్లలో 9 శాతానికి పైగా నష్టపోగా.. సోమవారం సెషన్‌లో ఏకంగా 8.28 శాతం లేదా రూ.444.75 నష్టంతో రూ.4,926.55 వద్ద ముగిసింది.

# కొనసాగుతున్న ఇండిగో సంక్షోభం!




న్యూఢిల్లీ: ఇండిగో విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంత రాయం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయా న మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. దేశవ్యాప్తంగా విమానాశ్ర యాల కార్యకలాపాలపై 24 గంటల సమీక్షను ప్రారంభించినట్లు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారులను ప్రధాన విమానాశ్రయాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ విషయంపై రామ్మోహన్ నాయుడు 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. "డిసెంబర్ 3వ తేదీ నుంచి ఇండిగో కార్యకలాపాల్లో సమస్యలు మొదలైనప్పటి నుంచి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలను "అసాధారణ పరిస్థితి"గా అభివరి?ంచిన ఆయన, ఉ న్నతస్థాయిలో తక్షణ జోక్యం అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల తమ మంత్రిత్వ శాఖ, డీజీసీఏ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎయిర్‌పోర్టులకు వెళ్లి తనిఖీలు చేయాలని, ప్రయాణికులతో మాట్లాడి వారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని, ఎయిర్‌లైన్ సిబ్బంది సేవలపై ఆరా తీయాలని సూచించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, గత కొన్ని రోజులుగా కార్యాచరణ సవాళ్లను ఎదుర్కొంటోంది. దీంతో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన విమానాశ్రయాల్లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు సోషల్ మీడియాలో భారీ క్యూలు, చెక్-ఇన్ ప్రక్రియలో జాప్యం, విమానాల సమాచారంపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి అధికారుల నివేదికలు అందిన తర్వాత, రానున్న 24 గంటల్లో మంత్రిత్వ శాఖ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. సిబ్బంది కొరతతో సతమతం అవుతున్న ఇండిగో.. తీరుతో ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఇండిగో విమానాలు రద్దయ్యాయి.. అయితే.. కొన్ని విమానాలు మాత్రం ఆలస్యంగా నడుస్తున్నాయి.. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు గోవా, అహ్మదాబాద్‌లో సర్వీసులు రద్దయ్యాయి.. సాంకేతికలోపం, సిబ్బంది కొరతతో విమానసేవల్లో సమస్యలు మొదలయ్యాయి.. ఈ క్రమంలో ఇండిగో ఫ్లైట్స్ క్యాన్సిలేషన్స్ ఎఫెక్ట్ పెళ్లిళ్లు, శుభకార్యాలపై కూడా పడుతోంది.. ఓచోట కొత్త జంట వాళ్ల రిసెప్షన్‌కి వాళ్లే వెళ్లలేకపోతే.. మరోచోట పెళ్లికొడుకు ఎయిర్‌పోర్ట్‌లో ఇరుక్కుపోయాడు.. ఈ వారం ఇండిగో విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు, అయితే ఈ అంతరాయం ముఖ్యంగా వధూవరులను తీవ్రంగా దెబ్బతీసింది. ఒక జంట వీడియో కాల్ ద్వారా తమ వివాహ రిసెప్షన్‌కు జరుపుకుంటే.. మరికొందరు వివాహ వేడుకలను రద్దు చేసుకోడానికి రెడీ అయ్యారు. కొందరైతే పెళ్లి వాయిదా వేయడం ఇష్టం లేక ఖరీదైన చార్టర్ ఫ్లైట్‌ను బుక్ చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ యువకుడు తన వెడ్డింగ్ కార్డును చూపిస్తూ..ఎయిర్‌లైన్స్ సమస్య కారణంగా నా పెళ్లికి నేను హాజరుకాలేకపోతున్నాను అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ..ఇది నా స్వంత పెళ్లి.. కానీ నేను వెళ్లలేకపోతున్నాను.


## సౌదీలో మద్యం అమ్మకాలపై నిబంధనల సడలింపు

న్యూఢిల్లీ సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి, ఇప్పుడు 'ప్రీమియం రెసిడెన్సీ' హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ నిపుణులను, ¬ ఎట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోం ది. రియాద్‌ను అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సడలింపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా సౌదీలో మహిళల డ్రైవింగ్‌పై నిషేధం ఎత్తివేయడం, సినిమా థియేటర్లు, వినోద కార్యక్రమాలకు అనుమతివ్వడం వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రియాద్‌తో పాటు దేశంలోని మరో రెండు నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్లు సమాచారం.

## కాశ్మీర్‌లో చైనా జాతీయుడి అరెస్ట్..!

న్యూఢిల్లీ: వీసా నిబంధనలను ఉల్లంఘించి, ఎలాంటి అనుమతి లేకుండా కశ్మీర్, లడఖ్‌లలోని అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించిన చైనా జాతీయుడిని శ్రీనగర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని ఏమైనా లీక్ చేశాడా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళితే, హూ కాంగ్‌తాయ్ (29) అనే చైనా పౌరుడు నవంబర్ 19న టూరిస్ట్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. నిబంధనల ప్రకారం వారణాసి, ఆగ్రా, జైపూర్, గయ వంటి కొన్ని బౌద్ధ క్షేత్రాలను మాత్రమే అతను సందర్శించాలి. కానీ అతడు ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ లో నమోదు చేసుకోకుండానే లడఖ్‌లోని లేహ్, జన్స్కర్‌తో పాటు కశ్మీర్ లోయలోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో పర్యటించాడు. జన్స్కర్ లో మూడు రోజుల పాటు ఉండి, స్థానిక బౌద్ధారామాలతో పాటు వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలను సందర్శించాడు. దక్షిణ కశ్మీర్ లోని ఆర్మీ విక్టర్ ఫోర్స్ హెడ్ క్వార్ట ర్సకుసమీపంలో ఉన్న అవంతిపుర బౌద్ధ శిథిలాలతో పాటు హజ్రత్‌బల్ దర్గా, శంకరాచార్య హిల్, దాల్ సరస్సు వంటి ప్రాంతాల్లో అతడి కదలికలు అనుమానాలకు తావిచ్చాయి. భారత్‌కు వచ్చిన వెంటనే బహిరంగ మార్కెట్‌లో ఒక ఇండియన్ సిమ్ కార్డును కూడా సంపాదించడం గమనార్హం. అతడి ఫోన్‌లోని బ్రౌజింగ్ హిస్టరీలో సీఆర్పీఎఫ్ మోహరింపు, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల గురించి వెతికినట్లు అధికారులు గుర్తించారు. విచార ణలో తాను అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో ఫిజిక్స్ చదివానని, గత తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్నానని హూ కాంగ్‌తాయ్ తెలిపాడు. తనకు ప్రయాణాలంటే ఇష్టమని, వీసా నిబంధనల ఉల్లంఘన గురించి తనకు తెలియదని చెబుతున్నాడు. అతడిని ప్రస్తుతం శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని బుద్గాం జిల్లా హుమ్హామా పోలీస్ పోస్టులో విచారిస్తున్నారు. అతడి పర్యటన వెనుక అసలు ఉద్దేశాన్ని రాబట్టేందుకు భద్రతా ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి.

# పరిశుభ్రతకు ఎక్కువ శ్రద్ధ వహించాలి..



వేసవి ఎండలతో అనేక రుగ్మతలు వ్యాపిస్తుండటం సహజం. డీహైడ్రేషన్ నుంచి ఫుడ్ పాయిజనింగ్ వరకూ కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చాలా వ్యాధులు వైరస్‌ల వల్ల వస్తాయి. పరిశుభ్రతకు ఎక్కువ శ్రద్ధ వహించాలి. తరచుగా చేతులు, కాళ్లు కడుక్కోవాలి. ప్రయాణం చేసేటప్పుడు హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించటం మర్చిపోవద్దు. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవటం చాలా అవసరం. వేసవిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వివరాలు ఇవిగో వడదెబ్బ (సన్‌స్ట్రోక్) : ఎండలో ఇష్టానుసారంగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, అయోమయం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, చెమట పట్టకపోవటం, కాళ్ళూ చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహకోల్పోవటం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లటం ఉత్తమం. ఈ సమస్య రాకుండా ఉండాలంటే తీరు ఎక్కువగా తాగాలి. నిమ్మరసం, కొబ్బరినీరు, గ్లూకోజ్ డి వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ ఫౌడర్ లేదా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోండి. అవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీరు తాగండి.

విషాహారం (ఫుడ్‌పాయిజనింగ్) : ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు వేసవిలో సాధారణం. ఇవి ఎక్కువగా హానికారక బ్యాక్టీరియా, పరాన్నజీవుల వల్ల వస్తాయి. అధిక వేడికారణంగా ఆహారం త్వరగా పాడవుతుంది. అలాంటి ఆహారం తీసుకోవటం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఆహారం చెడిపోకుండా చూసుకోవాలంటే బాగా ఉడికించాలి. వండిన ఆహారాన్ని బయట వేడిలో ఉంచినప్పుడు బ్యాక్టీరియా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు తాజా ఆహారాన్ని తినటం ముఖ్యం. మసాలాలతో కూడిన ఆహారాన్ని తగ్గించాలి.

కంటి ఇన్ఫెక్షన్ : ఈ కాలంలో కనిపించే కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు, అలెర్జీ, కంజక్టివైటిస్ ఉంటాయి. తగినంత విశ్రాంతి కళ్లకు ఇవ్వాలి. వాటిపై ఒత్తిడి తగ్గించాలి. మీ కళ్ళు, ముఖాన్ని క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కడగాలి. ఎండలో బయటకు వెళ్తే కళ్లజోడు వాడటం మంచిది. సమస్యలు వస్తే డాక్టరు సిఫారసు మేరకు ఐడ్రాప్స్, మందులు వాడాలి.

చర్మ సమస్యలు : సూర్యుడి అతినీలలోహిత కిరణాలు వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. చెమట వల్ల మచ్చలు, దురద మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండా లంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి కూడా ఉపయోగించొచ్చు. వాడిన దుస్తులను ఉతక్కుండా మళ్లీ వాడకూడదు. చెమట ఎక్కువగా పడుతున్నం దున స్నానం రెండుమూడు సార్లు చేయొచ్చు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమట పీల్చే కాటన్ దుస్తులు ధరించటం మేలు.

అతిసార : ఎండవేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనలు సాధారణం. కలుషిత ఆహారం తినటం, నీరు తాగటం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారితీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండటానికి నీటిని మరిగించిన తర్వాత మాత్రమే తాగటం అలవాటుగా చేసుకోవాలి. కూరగాయలను ముక్కలుగా చేయటానికి ముందు, తర్వాత వాటిని బాగా కడగాలి. ఇళ్లల్లో ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. పాడైనవి కాకుండా వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవటం మేలు.

చికెన్‌పాక్స్ : చికెన్‌పాక్స్ (అమ్మోరు) చాలా సాధారణ వేసవి వ్యాధుల్లో ఒకటి. ఇది అధిక జ్వరంతో శరీరంపై ఎరుపురంగులో ఉండే చిన్న దద్దుర్లు రూపంలో ప్రారంభమవుతుంది. ఇది పిల్లల్లో తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్న వారిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇది సోకినప్పుడు బయటకు తిరగకుండా ఇంట్లో ఉండటమే మేలు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. త్వరగా తగ్గే వీలుంది.

తట్టు : మీజిల్స్ మరో సాధారణ వేసవి వ్యాధి. మీజిల్స్‌కు కారణమయ్యే పారామిక్సో వైరస్ వేసవిలో వేగంగా సంతానోత్పత్తి చేస్తుంది. దీని ప్రారంభ లక్షణాలు దగ్గు, అధిక జ్వరం, గొంతునొప్పి, కళ్లు ఎర్రబడటం, తరువాతి దశలో, చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. మీజిల్స్ దద్దుర్లు శరీరం అంతటా కనిపిస్తాయి. మందులు వాడితే తగ్గిపోతుంది.

కామెర్లు : నీటి ద్వారా సంక్రమించే వ్యాధి. ఇది హైపటైటిస్ ఎ వల్ల వస్తుంది.ప్రధానంగా కలుషిత మైనఆహారం, నీటి వినియోగం వల్ల వస్తుంది.సకాలంలో చికిత్స చేయకపోతే ఈవ్యాధికాలేయం పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది పిత్తం అధిక ఉత్పత్తికి దారితీస్తుంది.

టైఫాయిడ్ : జ్వరం వస్తే సొంత వైద్యంతో నిర్లక్ష్యం చేయొద్దు. జ్వరంతోపాటు తలనొప్పి, నీరసంగా ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అపరిశుభ్ర ఆహారం, నీరు తీసు కోవటం వల్ల ఈ సమస్య వస్తుంది. కలుషిత ఆహారం, నీటి వనరులు బ్యాక్టీరియాకు సంతానోత్పత్తికి ప్రదేశంగా మారతాయి. టైఫాయిడ్ వస్తే బలహీనత, ఆకలిలేకపోవటం, కడుపులో నొప్పి, అధిక జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

గవదబిళ్ళలు : వేసవి వ్యాధుల్లో గవదబిళ్లలు అత్యంత అంటువ్యాధి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటువ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంథివాపు, కండరాలనొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవటం, బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.

తలనొప్పి : అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతి స్పందించటం వల్ల కూడా వస్తుంది.

పైన పేర్కొన్న వ్యాధులకు అధునాతనమైన మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టరు సలహా మేరకు వాటిని ఉపయోగిస్తే అవి నియంత్రణలోకి వస్తాయి.

ఈ చిట్కాలు పాటించండి: తరచూ మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతోపాటుగా ఎక్కువ మజ్జిగ తీసుకోవాలి. నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ బయటకు వెళ్లకండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సూర్యకాంతికి గురి కావడాన్ని తగ్గించండి. ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం వంటి కార్యక్రమాలను చేయండి. కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి. లేతరంగు, తేలికైన వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. బ్యాక్టీరియాతో ఉండే స్ట్రీట్‌ఫుడ్ తినొద్దు ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు. పండ్లు, కూరగాయల వినియోగాన్ని పెంచండి. ఆల్కాహాల్, కెఫైన్ తీసుకోవద్దు. కూల్‌డ్రింక్స్ తాగొద్దు.



## యాలకులను తిని గోరు వెచ్చని నీళ్లను తాగండి..

### రెండు పూటలా ఇలా చేస్తే ఎంతో మేలు జరుగుతుంది..

యాలకులనిమనం ఎంతో పూర్వకాలంనుంచే వంట ఇంటి మసాలా దినుసుగా ఉపయోగిస్తున్నాం. యాలకులను వేస్తే వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఎక్కువగా మసాలా వంటల్లో యాలకులను వేస్తుంటారు. అయితే ఆయుర్వేద ప్రకారం యాలకులు ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి.ఇవి మనల్నిఆరోగ్యంగాఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. యాలకులను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. యాలకుల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. కనుక యాలకులను రోజూ తింటుంటే వాపులు, నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్లు, మోకాళ్ల నొప్పులు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**జీర్ణ సమస్యలకు..:** రోజూ భోజనం చేసిన అనంతరం రెండు పూటలా ఒక యాలక్కాయను తిని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లను తాగుతుండాలి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ క్రియ సాఫీగా జరుగుతుంది. పొట్టలో గ్యాస్ ఏర్పడదు. కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే మలబద్దకం కూడా తగ్గుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. యాలకులను తిని గోరు వెచ్చని నీళ్లను తాగితే గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. దగ్గు, జలుబు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. శ్వాస మార్గాల్లో ఉండే అడ్డంకులు పోతాయి. శ్వాస సరిగ్గా ఆడుతుంది.

**గాఢ నిద్రకు..:** యాలకుల్లో ఒత్తిడిని తగ్గించే సమ్మేళనాలు ఉంటాయి. యాలకులను రోజూ తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. యాలకుల్లో డై యురెటిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకులను తింటే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోయి శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరం డిటాక్స్ అవుతుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. యాలకుల్లో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి నోట్లో ఉండే బ్యాక్టీరియాను నిర్మూలిస్తాయి. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తం కారే సమస్య తగ్గుతుంది.

**క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు..:** యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల మన శరీరానికి కలిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో కణాలు సురక్షితంగా ఉంటాయి. ఫలితంగా క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పోటు రాకుండా రక్షిస్తాయి. అధిక బరువు ఉన్నవారు రోజూ యాలకులను తిని నీళ్లను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. శరీర మెటబాలిజం పెరుగు తుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. బరువు నియంత్రణ లో ఉంటుంది. గుండె ఆరోగ్యానికి యాలకులు ఎంతో మేలు చేస్తాయి. వీటిని రోజూ తింటే రక్త సరఫరా మెరుగు పడుతుంది. ఇది బీపీని తగ్గిస్తుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుం ది. ఇలా యాలకులను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. రోజూ ఉదయం, సాయంత్రం తింటే ఎక్కువ ఫలితం ఉంటుంది.

# భయం నుంచే కోపం!



కోపం, క్రోధం, ఆగ్రహం.. భయం–అన్నీ ఒక్కటే. కోపం తాటాకు మంటలా క్షణికం అయితే, క్రోధం చింతనిప్పులా తీవ్రతరం.. దీర్ఘకాలికం అని చెబుతారు. మనిషన్న తర్వాత కోపం సహజం. కానీ, అది క్రోధంగా మారకూడదు. ఈ క్రోధం ఎదుటివారిని ఎంతవరకూ కాలుస్తుందో తెలియదు కానీ, తనను మాత్రం తక్షణం కాలుస్తుంది. విచక్షణ కోల్పోయేలా చేస్తుంది. ఓ సింహం తన కంటబడిన కోతిని వెంటాడుతుంది. అది ప్రాణ భీతితో ఎత్తైన చెట్టు ఎక్కింది. కోతి తప్పించుకుందన్న అక్కసు, ఆక్రోశంతో ఊగిపోయిన సింహం%ొ%పట్టలేని క్రోధంతో ఆ చెట్టును కూల్చేస్తుంది. అది కాస్తా తనమీదే పడటంతో.. ఆ చెట్టుకింద పడి సింహం చచ్చిపోతుంది. అందుకే 'తన కోపమే తన శత్రువు' అంటారు. 'విచక్షణా జ్యోతి.. కోపమనే సుడిగాలికి కొండెక్కుతుంది' అన్న అమెరికన్ తత్వవేత్త రాబర్ట్ ఇంగర్ సాల్ మాట అక్షర సత్యం. ఎర్రగా కాలిన నిప్పు కణికలను ఎవరిపైనైనా విసరాలనుకుంటే.. ముందు మన చెయ్యి కాలుతుందన్న విషయం మర్చిపోకూడదు. కోపం భయం మధ్య సంబంధం చాలా సంక్లిష్టమైనది.. సహజమైనది. అది లింగవివక్షనూ వదిలిపెట్టలేదు. తత్వవేత్త మార్తా నస్బామ్ 'యాంగర్ అండ్ ఫర్గివ్‌నెస్'లో రాసినట్లుగా.. 'మగ' అనే లేబుల్ వేయబడిన శిశువు ఏడుపు సాధారణంగా కోపంగా వున్నట్లు అర్థం చేసుకుంటారు. కానీ ఏడుస్తున్న ఆడపిల్ల 'భయం'తో ఏడుస్తున్నట్లుగా పరిగణించబడుతుంది. ఇక్కడ ఏడుస్తున్న చర్య ఒక్కటే. వివరణ మాత్రం లింగపరమైనది. కోపంగా వున్న స్త్రీ ఉన్మాదంగా వుంటుంది. ఆమెలో ఏదో తప్పు వుంది. అదే కోపంగా వున్న పురుషుడు వీరుడు. ఈ వివక్ష సమాజ దృక్కోణంలోనే కాదు, కోపం వ్యక్తీకరణలోనూ వేళ్లూనుకుంది.

కోపం, పగ, ద్వేషం..వంటి వాటిని బలమైన అంశాలుగా సినిమాల్లో, కథలు, పురాణాల్లో చూస్తాం. అన్యాయాన్ని సరిచేయడం, న్యాయాన్ని పరిరక్షించడం ఒక భాగం. అయితే, పగ తీర్చుకోవడం అనేది ధైర్యానికి సూచిక అనుకుంటారుగానీ, వాస్తవానికది భయానికి ప్రతీక. తన సోదరికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న రావణుడి ప్రయత్నం లంక నాశనానికి కారణమైంది. 'ప్రతి మనిషిలోనూ 160 రకాల భయాలుంటాయి' అంటాడు మనస్తత్వ శాస్త్ర పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్. ఏదోక విషయంలో అతిగా భయపడేవాళ్లే ఎక్కువ కోప్పడతారన్నది నిరూపితమైన అంశం. ఔరంగజేబు అప్పుడెప్పుడో ఏదో చేశాడని, ఇప్పుడు పగ తీర్చుకోవాలనుకోవడం, ఆతని సమాధి తవ్వేయాలనుకోవడం అంటే%ొ% భయం వల్ల కాక మరేమిటి? దేశ జనాభాలో మైనారిటీగా వున్న ముస్లిం, మైనారిటీల పట్ల అంత భయం ఎందుకు? చేతగానితనాన్ని, అసమర్థతని కప్పిపుచ్చుకోడానికి ప్రజల దృష్టి మళ్లించడానికి భయంతో చేస్తున్న ఎదురుదాడి తప్ప మరోటి కాదు.

నెల్సన్ మండేలా తన జీవితమంతా నిర్బంధంలోనే గడిపారు. ఆయన బయటికి వచ్చిన తర్వాత దీనికి కారణమైన వారిపై తప్పుడు కేసులు పెట్టి, పగ తీర్చుకునే ప్రయత్నం చేయలేదు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, దాని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. అందువల్లే ఆయన ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. గాంధీ హిందూ మతానికి ఏదో ద్రోహం చేశాడన్న పేరుతో గాడ్సే ఆయన్ని కాల్చి చంపాడు. నిజానికి మత ఘర్షణల చిచ్చు నుంచి భారతదేశాన్ని కాపాడినందుకు ఆయనంటే వాళ్లకి భయం. కోపం, పగ, ద్వేషం నుంచి మానవత్వ విలువలు పెరగవు. కోపం మానవత్వాన్ని హరిస్తుంది. విచక్షణ మందగిస్తుంది. అప్పుడిక మనిషి పశుప్రాయుడే. ఇదొక ఆటవిక లక్షణం మాత్రమే. ఈ తరహా జంతు లక్షణాలను గొప్పగా చిత్రీకరించుకొని సినిమాల్లోనే కాకుండా జీవితంలో కూడా ఆ కోపం ప్రదర్శించకపోతే నువ్వేదో చేతగాని వాడనుకుంటారేమోనన్న భయం. కోపం యొక్క గుండె తరచుగా ప్రతీకారాన్ని కోరుకుంటుంది' అంటారు నస్బామ్. ఈ మానవ బలహీనతను తమ రాజకీయ ప్రయోజనాలకు రెచ్చగొట్టి వాడుకోజూసే వారిలో మానవత్వం వుంటుందా? వారిని నాగరికులుగా పరిగణించగలమా?

## మామిడి బొప్పాయి సలాడ్



కావలసిన పదార్థాలు సన్నగా తరిగిన మామిడి పండు, బొప్పాయి పండు ముక్కలు : ఒక కప్పు చొప్పున, పచ్చిమిర్చి : రెండు, కొత్తిమీర తురుము : ఒక టీస్పూన్, వేయించిన పల్లీలు : పావు కప్పు, ఉప్పు : తగినంత,ఆలివ్ ఆయిల్ : రెండు టీస్పూన్లు, మిరియాలపొడి : పావు టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు : నాలుగు, తెల్ల నువ్వులు : రెండు టీస్పూన్లు. తయారీ విధానం ఒక గిన్నెలో మామిడి, బొప్పాయి ముక్క ల్ని వేసి, చిన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, వేయించిన పల్లీలు, తగినంత ఉప్పు, ఆలివ్ ఆయిల్, మిరియాల పొడి, తురిమిన వెల్లుల్లి వేసి బాగా కలపాలి. చివరిగా నువ్వులు వేసి మరోసారి కలుపుకొంటేనోరూరించే మామిడి బొప్పాయి సలాడ్ సిద్ధం.

## రోజూ గుప్పెడు నట్స్‌ను తింటే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?

### ఇవి తెలిస్తే వెంటనే తినడం మొదలు పెడతారు..!

బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్. ఇలా మనకు తినేందుకు అనేక రకాల నట్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ ధర ఎక్కువ ఉంటుందని, లేదా మరేదైనా ఇతర కారణాల వల్ల ఈ గింజలను చాలా మంది తినడం లేదు. కానీ వాస్తవానికి ఈ గింజలను తింటే మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. వీటిన్నింటినీ కలిపి రోజుకు గుప్పెడు మోతాదులో రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం తినాలి. ఇలా ఈ గింజలను తినడం వల్ల మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. నట్స్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ముఖ్యంగా బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్, పల్లీలు వంటి గింజల్లో ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

గుండె ఆరోగ్యానికి..: చేపలను తినడం వల్ల లభించే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఈ గింజల్లోనూ ఉంటాయి. అందువల్ల చేపలను తినలేని వారికి ఈ గింజలు మంచి ఆహారం అని చెప్పవచ్చు. ఈ గింజల్లో కొలెస్ట్రాల్ ఉండదు. కానీ వీటిల్లో కొలెస్ట్రాల్ ఉంటుందని, అది గుండెకు హాని చేస్తుందని అనుకుంటారు. అందులో ఎంత మాత్రం నిజం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈ నట్స్‌ను మోతాదులో తింటేనే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దేన్నీ అతిగా తినరాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో ఉండే ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గుతుంది. హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) పెరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.


జీర్ణ సమస్యలకు..: నట్స్‌లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా ఉంటుంది. నట్స్‌లో ఉండే పీచు బరువు తగ్గడానికి సహాయం చేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో జంక్ ఫుడ్ జోలికి వెళ్లరు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. నట్స్‌ను తినడం వల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఉండే ఫైబర్ గ్యాస్, అసిడిటీ, మలబద్దకం, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తుంది. నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది.

విటమిన్ ఇ అధికం..: నట్స్‌లో విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్త నాళాల్లో కొవ్వు చేరకుండా చూస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాదు. పక్షవాతం వంటి జబ్బులు రాకుండా నివారిస్తుంది. నట్స్‌లో వృక్ష సంబంధ స్టెరాల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ తగ్గేందుకు దోహదం చేస్తాయి. గింజల్లో ఉండే ఎల్–ఆర్గినైన్ అనే సమ్మేళనం రక్త నాళాలను సాగేలా చేస్తుంది. దీంతో రక్త నాళాలు గట్టి పడకుండా ఉంటాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ విధంగా పలు



నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. అయితే అన్ని నట్స్‌ను తినకపోతే ఏదైనా ఒక రకానికి చెందిన నట్స్‌ను అయినా రోజూ గుప్పెడు మోతాదులో తినే ప్రయత్నం చేయాలి. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# విద్వేషం.. హింస



స్ట్రేలియాలోని సిడ్నీ అత్యంత పాశవిక మారణకాండకు వేదికగా మారడం దిగ్భ్రాంతికరం. యూదులే లక్ష్యంగా తండ్రీ కొడుకులు తుపాకీ గుళ్ల వర్షం కురిపించడంతో పదేళ్ల బాలిక సహా 16 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా 'హనూకా' వేడుక చేసుకునేందుకు సిడ్నీలోని బొండీ బీచ్‌లో కొవ్వొత్తులు వెలిగించడానికి వచ్చిన చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ దుండగుల కాల్పుల్లో రక్తమోడడం అత్యంత బాధాకరం. మతపరమైన ద్వేషం, జాత్యహంకారం, విద్వేష ఉపన్యాసాలు, మీడియా, సోషల్ మీడియాలో విస్తరిస్తున్న ఉన్మాద భావనలు.. ఇవన్నీ ఇలాంటి దుర్మార్గాలకు ఆజ్యం పోస్తున్నాయి.

విద్వేషం మరింత విద్వేషాన్ని పెంచుతుందే కానీ..శాంతినీ, సామరస్యాన్నీ కలిగించదని గౌతమ బుద్ధుడు దగ్గర నుంచి అన్ని మతాల ప్రవక్తలు ప్రకటిస్తున్నదే! యూదులపై ద్వేషభావం ఆస్ట్రేలియా సమాజాన్ని కలుషితం చేస్తోందని, అక్కడి ప్రభుత్వ విధానాలు ఆ అగ్నికి ఆజ్యం పోస్తున్నాయంటూఈ ఘటన జరిగిన వెంటనే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఊగిపోయారు. చిన్నారులు, మహిళలు అన్న కనికరంగానీ, ఆకలి తీర్చుకునేందుకు క్యూలో నిలబడ్డారన్న ఇంగితం కానీ, ఆసుపత్రిలో కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారన్న జ్ఞానం కానీ లేకుండా అమానుషంగా 70 వేల మందికిపైగా అమాయకులను ఊచకోత కోసిన నెతన్యాహు సర్కారు, దానికి అండదండలిచ్చిన అమెరికా లాంటి పశ్చిమ దేశాలే ఇలాంటి మారణ హెూమాలకు సంజాయిషీ చెప్పాలి.

పాలస్తీనాపై నరమేధం తర్వాత ఆస్ట్రేలియాలో యూదు వ్యతిరేక ఘటనలు 316 శాతం పెరగడం, రెండు వేల కంటే ఎక్కువ కేసులు నమోదవడమే ఇందుకు సాక్ష్యం. ప్రాణాలకు తెగించి ఓ దుండగుడి చేతిలోని తుపాకీ లాక్కుని అనేకమంది ప్రాణాలను కాపాడిన అహ్మద్ అల్ అహ్మద్‌కు ప్రపంచమంతా సెల్యూట్ చేస్తోంది. పహల్గాం ఉగ్రదాడి సందర్భంలో టూరిస్టులను కాపాడి, ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా అందరికీ గుర్తొస్తాడు. ఒకరికి ఒకరు వెలుగుగా ఉండాలని, ఐక్యంగా ఉండాలని ఆస్ట్రేలియా ప్రధాని పిలుపునివ్వడం, అహ్మద్‌ను ఆసుపత్రిలో కలిసి అభినందించడం మంచి పరిణామం. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరగడంతో తుపాకీ నియంత్రణ చట్టాలను ఆస్ట్రేలియా అమలు చేస్తోంది. వాటికి మరింత పదును పెట్టడం, దోషులను కఠినంగా శిక్షించడం, సమాజంలో సోదర భావాన్ని పెంపొందించడం అత్యవసరం.

ఒక ఘటన జరగ్గానే ఆ మతానికి చెందిన ప్రతి ఒక్కరినీ ద్వేషంతో చూడటం మొదలు పెడితే సమాజం విడిపోతుంది. మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులు కోరుకునేది ఇదే. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు సంఘ్ పరివార్‌లోని విహెచ్‌పి, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు రెచ్చిపోతున్నాయి. మైనారిటీలంతా శత్రువులు, జీహాదీలని, వారిపై దాడులు చేయడం ధర్మ రక్షణ అని, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం హీరోయిజం అని యువతను పక్కదోవ పట్టించడం, అందు కోసం అలవోకగా అబద్ధాలను ప్రచారం చేయడం అత్యంత ప్రమాదకరం. గోడీ మీడియాతోపాటు సోషల్ మీడియా కూడా అందుకు ఇతోధికంగా సహకరించడం తగదు.

అమెరికా, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో మైనారిటీగా వున్న హిందువులపై దాడులు జరిగినపుడు విహెచ్‌పి లాంటి సంస్థలు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. విద్వేషం ఏ దేశంలోనైనా మైనారిటీలకు ముప్పుగా పరిగణిస్తుందనేది జగమెరిగిన సత్యం. జాత్యహంకారం, విద్వేషాన్ని పెంచి పోషిస్తే.. అది తిరిగి వారినే కాటేస్తుందనడానికి పక్కనే ఉన్న పాకిస్తాన్ లాంటి దేశాల్లో నిత్యం సాగుతున్న ఉగ్రవాద ఘటనలే ఉదాహరణ. భిన్నత్వం లో ఏకత్వాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని, సౌభ్రాతృత్వా న్ని, రాజ్యాంగ విలువలను రక్షించుకోవడమే భారతీయత. సమాజంలో, రాజకీయాల్లో పెరుగుతున్న ద్వేషాన్ని తిప్పికొట్టడంతోపాటు అహ్మద్‌లాంటివారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే స్ఫూర్తిని మనసు నిండా నింపుకోవడం తక్షణ కర్తవ్యం. విద్వేషాన్ని విడనాడి మానవత్వమే మతమని, అభిమతమని, అత్యున్నతమని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనడమే ఇలాంటి మారణహెూమాలకు విరుగుడు.

## డిజైనింగ్ లోపాలతో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు

### -శాశ్వత పరిష్కారం కోరిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి :తిరుపతి పార్లమెంట్ పరిధిలోని రైల్వే అండర్ బ్రిడ్జ్‌ల వద్ద వర్షాకాలంలో తలెత్తుతున్న సమస్యల గూర్చి తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ప్రస్తావించారు. చిన్నపాటి వర్షాలకే కొన్ని అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలవడంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారడం తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ సమాదనం ఇచ్చారు. దేశవ్యాప్తంగా రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు, సబ్‌వేలలో నీరు నిలిచిపోకుండా డ్రైనేజ్ వ్యవస్థలు, నీటి మళ్లింపు మార్గాలు, క్రాస్ డ్రైన్లు, జాయింట్ సీలింగ్, ఎంట్రీ వద్ద హంప్‌లు, కవర్ల షెడ్‌లు, అత్యవసర పంపింగ్ ఏర్పాట్లు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అసాధారణ వర్షపాతం సమయం లో ట్రాఫిక్ నిలిపివేయడం, హెచ్చరిక బోర్డులు, గేటు బారియర్లు, వాచ్‌మన్‌ల నియామకం వంటి భద్రతా చర్యలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి, మొత్తం 43 రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు ఉన్నాయని, గత వర్షాకాలంలో గూడూరు, రేణిగుంట సెక్షన్ లో చెర్లోపల్లి, కాపుగున్నేరి, రాచగున్నేరి లోని మూడు అండర్ బ్రిడ్జ్‌ల వద్ద నీరు నిలిచి సమస్య వచ్చిందని, దానిని పంపింగ్ ద్వారా పరిష్కరించినట్లు సమాధానంలో పేర్కొన్నారు. అలాగే తిరుపతి నియోజకవర్గంలో రూ.208 కోట్ల వ్యయంతో 6 చోట్ల రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జ్‌లు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలియజేశారు. మొత్తంగా సమస్య ఉందని ప్రభుత్వం గుర్తించిందని, తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కా రాల దిశగా పనులు జరుగుతున్నా యని మంత్రి తన సమాదనంలో తెలియజేశారు. అయితే డిజైన్ లోపాలపై ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు నిర్ణయించినట్లు స్పష్టమైన వివరాలు ఇవ్వలేదు. స్థానిక మున్సిపల్ సంస్థలతో సమన్వయంతో సమగ్ర డ్రైనేజ్ పరిష్కారాలపైపని చేస్తున్నామని మాత్రమే తెలిపారు. ఈ అంశంపై ఎంపీ గురుమూర్తి స్పందిస్తూ రైల్వే అండర్ బ్రిడ్జ్‌లలో వర్షాకాలం నీరు నిలవడం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడినా కూడా కొన్ని అండర్ బ్రిడ్జ్‌లు నీటితో నిండిపోవడం చూస్తుంటే స్పష్టమైన డిజైన్ లోపాలు, సమగ్ర డ్రైనేజ్ ప్రణాళిక లేకపోవడాన్ని సూచిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక పంపింగ్ ఏర్పాట్లకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారాలు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జ్‌లలో సరైన డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఉన్న అండర్ బ్రిడ్జ్‌లలో డిజైన్ ఆడిట్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

# అక్కరకు కాని సంక్షేమ పథకాలు

మెదక్, : రెండు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను హస్తగతం చేసుకున్నామని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పైకి చెబుతున్నా, అంతర్గతంగా మాత్రం ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పోరులో బీఆర్ఎస్ గ్రాఫ్ అనూహ్యంగా పెరగడం, రెండు వేలకు పైగా సర్పంచ్ స్థానాలు గెలుచుకోవడంతో కాంగ్రెస్ నాయకుల్లో అంతర్మథనం మొదలైంది. అనుకున్న లక్ష్యానికి ఎందుకు చేరుకోలేపోయామనే అంశంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించిందిడీసీసీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, క్షేత్రస్థాయిలోకి వెళ్లి సీరియస్‌గా పనిచేయలేదని.. అసంతృప్తులను, అసమ్మతిని బుజ్జగించి దారిలోకి తీసుకురావడంలో డీసీసీ అధ్యక్షులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, మండల పార్టీనాయకులువిఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెబల్స్‌ను బుజ్జగించి.. పోటీ నుంచి తప్పించకుండా వదిలేయడం వల్లే పంచాయతీ పోరులో అనుకున్న లక్ష్యం సాధించలేకపోయామనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితి వల్లే ఓట్లు బాగా చీలి బీఆర్ఎస్, బీజేపీ లాభపడ్డాయి అని అంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించడంలోనూ వెనకబడిపోయినట్లుగా కాంగ్రెస్ నేతలు గుర్తించినట్లుగా గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అయితే 70 నుంచి 80 శాతం వరకు సర్పంచ్‌లను గెలుచుకుంటామని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్న విషయం తెలిసిందేకానీ, రెండు విడతల్లో 8,555 గ్రామాల్లో ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ 4,579 పంచాయతీల్లో మాత్రమే విజయం సాధించింది. ఇక బీఆర్ఎస్ 2,3 57, బీజేపీ 457, ఇతరులు 1,162 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందారు. రెండు విడతల్లో వచ్చిన ఫలితాలు మూడో విడతలో పునరావృతం కాకుండా జగ్రత్తపడాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి నాయకు డు అప్రమత్తంగా ఉండాలని గాంధీభవన్ నుంచి డీసీసీ అధ్యక్షులు, స్థానిక నాయకులకు ఆదేశాలు వెళ్లినట్లుగా తెలిసింది. ఇదే పరిస్థితి కొనసాగితే, త్వరలోనే పార్టీపరంగా జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్, కార్పోరేషన్ల ఎన్నికల్లో నష్టం జరుగుతుందని పార్టీ పెద్దలు హెచ్చరిక కూడా చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ వెయ్యిలోపే సర్పంచ్‌లు గెలుస్తుందని కాంగ్రెస్ నేతలు మొదటి నుం చి భావించారు. కానీ, ఫలితాలు చూస్తే ఆశ్చర్యపడాల్సిన పరిస్థితి వచ్చిందని వారు చెబు తున్నారు. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు గట్టిపోటీ ఇచ్చారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలతో పాటు డీసీసీ నాయకుల్లో కొందరు పనిచేసినా.. మరికొందరు పెద్దగా దృష్టి సారించలేదని, అందుకే సగంస్థానాలకే పరిమితం కావాల్సి వచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ లాంటి సంక్షేమ పథకాలు అందజేస్తున్నా ఫలితాలు ఆశించిన మేర ఫలితాలు రాలేదనే చర్చ జరు గుతోంది. మరోవైపు బీఆర్ఎస్ స్థానిక క్యాడ ర్ పంచాయతీ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని.. కాంగ్రెస్‌కు ధీటుగా పనిచేసి 2 వేలకు పైగా సర్పంచ్‌లను గెలిపించుకున్నారని చర్చ జరుగుతోంది బీజేపీకూడా ఊహించని విధంగా ఫలితాలను సాధించుకుంది. రెండు విడతలు కలిపి 457పంచాయతీలు గెలవడంపై ఆపార్టీ రాష్ట్ర నాయకత్వమే ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది.


# హైదరాబాద్ జూకు కంగారూలు, జీబ్రాలు



హైదరాబాద్, : నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే పిల్లలు, కుటుంబాలు, వన్యప్రాణి ప్రేమికులు త్వరలో మొదటిసారిగా కంగారూలను చూడబోతున్నారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆస్ట్రేలియా జాతి జంతువులను తీసుకురావడానికి హైదరాబాద్ జూ సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ నడుపుతున్న అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ కేంద్రమైన వంతారా నుండి ఒక జత కంగారూలను తీసుకురానున్నారు. వాటి కోసం ఎన్‌క్లోజర్లు, రాత్రిపూట నివాస గృహాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు జూ అధికారులు తెలిపారు. వంతారా డైరెక్టర్ బ్రిజ్ కిషోర్ గుప్తా నేతృత్వంలోని ఒక బృందం ఇటీవల హైదరాబాద్ జూలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసింది.'జూలో కంగారూలు ఉండటం ఇది మొదటిసారి. మేం త్వరలో వంతారా నుండి ఒక మగ, ఒక ఆడ కంగారూను తీసుకుంటాం. అవి వచ్చిన తర్వాత, వాటిని ప్రదర్శనకు ఉంచే ముందు కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం.' అని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఇప్పుడు వంతారా నుంచి వచ్చే కంగారూలకు బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఏనుగులలోని ఒకదానిని వంతారాకు పంపనుంది. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుండి నాలుగు కంగారూలను తీసుకురావాలని హైదరాబాద్ జూ ప్రణాళిక వేసింది. కానీ కొవిడ్-19 మహమ్మారి కారణంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆ ఒప్పందాన్ని నిలిపివేశారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం జూలో ఒంటరిగా ఉన్న సన్నీ అనే మగ జిరాఫీకి త్వరలో ఒక ఆడ తోడు రానుంది. సీనియర్ అధికారులు ఇటీవల మైసూరు జూను సందర్శించి ఈ మార్పిడిని ఖరారు చేశారు. ఈ నెలాఖరులోగా జిరాఫీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూలో 2,200 కంటే ఎక్కువ జంతువులు, పక్షులతో పాటు 199 జాతుల జీవులు ఉన్నాయి. త్వరలో జీబ్రాలు కూడా ఇక్కడ మరింత సందడిగా చేయనున్నాయి. జూ త్వరలో వంతారా నుండి ఒక జత జీబ్రాలను తీసుకురానుంది. ఇప్పటికే ఆ కేంద్రం నుండి తీసుకువచ్చిన రెండు మగ, ఒక ఆడ జీబ్రాలతో కలిపి వీటి సంఖ్య పెరుగుతుంది. 37 ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జూకు జీబ్రాలు తిరిగి వచ్చాయి.

# ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్


మాస్కో : క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష బేధం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు. ఈ వ్యాక్సిన్ ఎఖీఔం సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్‌క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ ? మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్?వీ' అనే పేరు ప్రతిపాదించారు. మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30?50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు. 2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10




కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివృద్ధి చెడుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా. ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.


# ఆగని పైరసీ..!

హైదరాబాద్: ఐబొమ్మ రవిపై పోలీసులు 4 రకాల కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అతన్ని రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారు. అది ఏమాత్రం చాలలేదని చెబుతూ.. మళ్లీ కస్టడీ కోరారు. దాంతో కోర్టు.. 4 కేసుల్లోనూ కస్టడీకి అనుమతించింది. ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతించింది. అందువల్ల పోలీసులు గురువారం నుంచి మళ్లీ రవిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడం మొదలుపెడతారు. ఇదంతా ఓకే.. కానీ అసలు సమస్య సాల్వ్ అవ్వలేదు. రవి అరెస్టు తర్వాత పైరసీ ఎక్కడా ఆగలేదు. కొత్తగా రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలూ ఎప్పట్లాగే పైరసీఅవుతున్నాయి. ఒక్క సినిమా కూడా పైరసీ అవ్వకుండా ఆగింది లేదు. మరి రవిని అరెస్టు చేసి పోలీసులు సాధించింది ఏంటి? అనే ప్రశ్న వస్తోంది. అసలు పైరసీ ఎందుకు ఆగట్లేదు అనేది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. ఎందుకు అంటే.. రవి.. ఏ కొత్త సినిమానూ డైరెక్టుగా పైరసీ చెయ్యలేదు. అంటే.. థియేటర్‌కి వెళ్లి.. రహస్యంగా వీడియో రికార్డులు చెయ్యడం వంటివి రవి చెయ్యలేదు. అతను ఇతర పైరసీ సైట్ల నుంచి పైరసీ సినిమాల్ని తీసుకొని.. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అందువల్ల అసలు పైరసీ సైట్లు అలాగే ఉన్నాయి. వాటిని పోలీసులు బ్రేక్ చెయ్యలేకపోతున్నారు. రవి దొరకగానే.. అతనే పైరసీ కింగ్ అని చెప్పారు. కానీ.. అతను పైరసీ మాఫియాలో చిన్న పార్ట్ మాత్రమే. మనకు ఇంకో డౌట్ రావచ్చు. ఓటీటీలో సినిమాల్ని అతను పైరసీ చేసేవాడు కదా. ఇక ఇప్పుడు ఆ పైరసీ




ఆగిపోయినట్లే కదా అని. అంత లేదు. ఆ పైరసీ కూడా ఆగలేదు. రవి ఏం చేసేవాడంటే.. ఆఖీఓ టెక్నాలజీని వాడేవాడు. దీని ద్వారా ఓటీటీ సినిమాలను ప్లే చేస్తూ.. స్క్రీన్ రికార్డ్ చేసేవాడు. అదే సమయంలో.. ఆడియో కూడా రికార్డ్ అయ్యేది. అలా రికార్డ్ అయిన సినిమాల్ని ఐబొమ్మ, బొప్పం వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశాడు. రవి అరెస్టు అయిన తర్వాత కూడా ఓటీటీ సినిమాలు పైరసీ అవుతూనే ఉన్నాయి. చాలా మంది ఆఖీఓని వాడి.. పైరసీ చేస్తున్నారు. అంటే.. రవి అనే వ్యక్తి.. ఈ పైరసీ మాఫియాలో కింగ్ కాదు. అతని అరెస్టుతో పోలీసులు సాధించేది ఏమీ లేదని తేలిపోతోంది.

# ఉద్దానం బాధితులకు ఊరట



## అందుబాటులోకి పలాస కిడ్నీ సెంటర్

శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవెరబోతోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలాసలో చారిత్రాత్మక అడుగు వేసింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా, తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆపరేషన్‌ని నిర్వహించనున్నారు. దేశంలోని ప్రముఖ కిడ్నీ మార్పిడి నిపుణులు ప్రత్యేకంగా పలాసకు విచ్చేసి స్థానిక వైద్యులతో కలిసి ఈ క్లిష్టమైన పక్రియను విజయవంతంగా పూర్తి చేయనున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది. పలాస సెంటర్ అభివృద్ధికి రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసి, ఆపరేషన్ థియేటర్ల ఆధునికీకరణ, దయాలసిస్ యూనిట్లు, పోస్ట్ – ఆపరేటివ్ కేర్ సెంటర్లను బలోపేతం చేసింది. పేద రోగులకు ఎక్కువ ఖర్చుతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పొందే కిడ్నీ మార్పిడి చికిత్సను పలాస కేంద్రంలోనే ప్రభుత్వం బాధ్యతగా నిర్వహిస్తోంది. గతంలో కిడ్నీ సమస్యల చికిత్స కోసం ఉద్దానం వాసులు విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లేవారు. ఇప్పుడు పలాసలోనే ఈ సదుపాయం రావడం వల్ల ప్రయాణ భారం తగ్గుతోండటంతో పాటు అత్యవసర సందర్భాల్లో ప్రాణాలు కాపాడే అవకాశాలు మెరుగుపడతాయి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా నిరంతరం స్క్రీనింగ్ పరీక్షలు, మందుల పంపిణీ జరుగుతుంది. పేద రోగులకు ప్రైవేట్ ఆస్పత్రులలో లక్షల రూపాయలు ఖర్చయ్యే చికిత్స ఇక్కడ ఉచితంగా లేదా రాయితీపై అందుబాటులో ప్రభుత్వం తీసుకువచ్చింది.

# అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి ప్రకటించిన ఇరాన్..తిప్పి కొట్టిన అమెరికా

టెహ్రాన్: అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది.

అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్‌ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

# రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు

**పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు**

**అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ**

**సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సిఎం చంద్రబాబు**



విజయవాడ, (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ.20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ.14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నా రన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతోపాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ కార్యక్రమాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూడదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడామన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నానన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు. ÷-రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ.500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు. పక్కనే ఉన్న తమిళనాడు కానీ.. కర్ణాటక కానీ రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కానీ ఏపీలో రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చిన ఏకైక ప్రభుత్వం.. ఎన్డీఏ ప్రభుత్వమని స్పష్టం చేశారు. పొగాకు, ఉల్లి రైతులను ఆదుకునేలా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. మోటా, కోకో పంటలు దెబ్బ తింటే.. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. నష్టపోయిన రైతాంగానికి రూ.1,338 కోట్లు అందచేశామని గుర్తు చేశారు. మేము విజన్ 2047 తయారు చేశాం.. ప్రధాని నేతృత్వంలో వికసిత్ భారత్, ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కల సాకారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మనకు స్వాతంత్య్రం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుందన్నారు. ఆ సమయానికి మన దేశం, మన రాష్ట్రం అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# అనిత ఎందుకో లాస్ట్..!



విశాఖపట్టణం: ఏపీలోటీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. ప్రతి 15 రోజులకు మంత్రి మండలి సమావేశం. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల రివ్యూ కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో మంత్రులకు ర్యాంకింగ్, వారి పనితీరు మదింపు వంటి విషయంలో సీఎం చంద్రబాబు ముందు ఉంటున్నారు. వారికి ర్యాంకింగ్స్ ఇస్తున్నారు. తాజాగా కలెక్టర్ల రివ్యూలు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇచ్చారు చంద్రబాబు. ఈ ర్యాంకింగ్స్ లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తొలి స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. మంత్రుల శాఖలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో ఈ ర్యాంకింగ్స్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. మంత్రుల శాఖల ప్రగతిలో ఈ ఫైల్ క్లియరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే సీఎం చంద్రబాబు దీనిపైనే స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మంత్రుల పనితీరుపై మదింపు.. అమరావతిలో కలెక్టర్ల సమావేశం తొలి రోజున మంత్రుల పనితీరుపై హాట్ కామెంట్స్ చేశారు సీఎం చంద్రబాబు. ఆయా శాఖల్లో ఫైళ్ళ క్లియరెన్స్ ఎంత వేగంగా జరుగుతుందని అంశంపై మిత్రులందరికీ రేటింగ్స్ ప్రకటించారు. తొలి స్థానంలో కింజరాపు అచ్చెనాయుడు నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగు స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో నిలిచారు. మంత్రులు తమ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఎంత సమయం తీసుకుంటున్నారో చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాలు వేగంగా పూర్తి అయ్యేలా త్వరగా ఫైళ్లను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు సీఎం చంద్రబాబు. పాలనలో వేగం పెంచడం ద్వారా.. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వెల్లడించారు.ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల సమావేశం జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నారు సీఎం చంద్రబాబుఅందులో భాగంగా నిన్ననే అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈరోజు కూడా అది కొనసాగనుంది. కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. శాఖల ఆదాయంపై కూడా సమీక్షిస్తారు. రాష్ట్ర విద్యారంగం తో పాటు ఉపాధి అవకాశాలపై కూడా చర్చించనున్నారు ఈరోజు సమావేశంలో. కోర్టులో ఉన్న కేసులు, న్యాయశాఖ పరిధిలో ఉన్న అంశాల పైన అధికారులు సీఎంకు వివరాలు అందించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి కీలక నిర్ణయం కూడా ఈరోజు తీసుకోనున్నారు. తొలిరోజు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇవ్వగా.. ఈరోజు అధికారులకు ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు సీఎం చంద్రబాబు.

# ఈ సారి వారసులకు షాక్ తప్పదా?

తిరుపతి: 2024లో ఘోర పరాజయం. ఆల్మోస్ట్ వైసీపీ శూన్యం నుంచి తిరిగి బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయోగాలు చేసే పరిస్థితి లేదంటున్నారట వైసీపీ అధినేత జగన్. నియోజకవర్గాలపై పట్టున్న నేతలు..రాజకీయంగా అనుభవం ఉన్న లీడర్లు, కుల బలం ఉన్న నేతలకే మళ్లీ టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నారట. కానీ చాలామంది నేతలు..వయోభారమనో..తాము యాక్టీవ్‌గా ఉన్నప్పుడే వారసులను రాజకీయాల్లోకి తేవాలని ఆశపడుతున్నారట. అందుకే తమ కొడుకు, కూతురుకు టికెట్ కావాలని ఇప్పటినుంచే అర్జీలు పెట్టుకున్నారట. ఇలా వైసీపీలో చాలామంది లీడర్ల వారసులు రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారట. 2024లోనే టికెట్ ఆశించిగా కొందరికి తప్ప..మిగతా చోట్ల తండ్రులనే రంగంలోకి దించారు. కొన్ని చోట్ల అధినాయకత్వాన్ని మెప్పించి ఒప్పించి కొందరు లీడర్లు తమ వారసులకు టికెట్లు ఇప్పించుకున్నా పరాభావం తప్పలేదు. దాంతో వైసీపీ హైకమాండ్ ఆలోచనలు మారాయని అంటున్నారు. ఈసారి ఎన్నికలు 2024 కంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనవి అని వైసీపీ పెద్దలు భావిస్తున్నారట. దాంతో వారసులకు నో చాన్స్ అన్న చర్చ అయితే ఫ్యాన్ పార్టీలో జోరుగా సాగుతోందని చెబుతున్నారు.గత ఎన్నికల్లో తిరుపతి నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అలాగే చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టూ పోటీ చేసినా గెలవలేకపోయారు. దాంతో ఈసారి వీరి ప్లేస్ లో తండ్రులనే పోటీకి రెడీ కావాలని వైసీపీ హైకమాండ్ సూచించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తిరిగి యాక్టివ్ అయ్యారని చర్చించుకుంటున్నారు. భూమన పార్టీ నేతలతో కూడా ఎక్కువగా సమావేశాలు జరుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కూడా సంకేతాలు ఇస్తున్నారట.తన కుమారుడికి రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని వైసీపీకి రాబోయే ఎన్నికలు కీలకం కావడంతో తానే పోటీకి సిద్ధమవుతున్నానని చెబుతున్నారట. ఇక మాజీ మంత్రి పేర్ని నాని అయితే మచిలీపట్నంలో తన కుమారుడినే పోటీకి పెట్టాలని చూస్తున్నారట. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అదే ఆలోచనలో ఉన్నారని..మరోసారి మోహిత్‌రెడ్డినే బరిలోకి దించబోతున్నారట.వీళ్లు ఆల్రెడీ పోటీ చేసి ఓడిన నేతలు. వాళ్లకు టికెట్ ఇచ్చేందుకు వైసీపీ అధిష్టానం సుముఖంగా లేదంటున్నారు. అలాంటిది మరికొందరు నేతలు రాబోయే ఎన్నికల్లో తమ కూతురు, లేదా కొడుకును బరిలోకి దింపాలనుకుంటున్నారు. అయితే కీలక స్థానాలలో తండ్రులే పోటీ పడితే మంచి రిజల్ట్స్ వస్తాయన్నది వైసీపీ హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ తన కుమారుడు బొత్స సందీప్‌ను చీపురుపల్లి నుంచి దించాలని అనుకుంటున్నారట. అలాగే మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తన కుమార్తెకి టికెట్ కోరబోతున్నారట. శ్రీకాకుళంలో ధర్మాన సోదరులు తమ కుమారులనే పోటీకి దించే యోచనలో ఉన్నారని తెలుస్తోంది.అయితే జగన్ వీరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. వారసులకు టికెట్ ఇవ్వడం పక్కన పెట్టి..సీనియర్ లీడర్లను ఎంపీలుగా బరిలోకి దించాలనేది జగన్ ఆలోచనగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పోటీ చేసి ఓడిన వారసులకు మళ్లీ టికెట్ దక్కేనా? కొత్తగా వారసులకు సీటు ఇచ్చేందుకు జగన్ ఓకే చెప్తారా? అనేది ఇప్పటికైతే తేలని అంశంగా ఉంది. అయితే అధికారంలో ఉన్న టీడీపీ నెమ్మదిగా సీనియర్లను సైడ్ చేస్తూ యంగ్ లీడర్లకు అవకాశాలు ఇస్తుంటే.. వైసీపీ మాత్రం సీనియర్లను వదలకూడదని పట్టుదలగా ఉండటం ఆసక్తికరంగా మారింది.

# ఏపీకి గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రం

విజయవాడ: కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో ఏపీకి రిలీఫ్ దక్కింది. జల్‌జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని పెంచడంతో లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది. కేంద్రం జలజీవన్ మిషన్ పథకం ద్వారా రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి సౌక్యరం కల్పించి సురక్షితమైన నీటిని అందించాలని టార్గెట్ పెట్టుకుంది. ఏపీలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని సరిగా అమలు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుంచి వాటా నిధులు సరిగా ఇవ్వకపోవడంతో జలజీవన్ మిషన్ పనుల్లో ఆలస్యంకాగా.. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ పథకం గడువు 2024కే ముగిసింది. దీంతో జలజీవన్ మిషన్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఈ పథకంపై ఫోకస్ పెట్టారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సమయంలో జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని 2028 వరకు పెంచాలని కోరారు. తాజాగా కేంద్ర కేబినెట్ ఈ జలజీవన్ మిషన్ పథకం గడువును 2028 వరకు పొడిగించింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది.2019లో కేంద్రం ఈజలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. ఆ సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 95లక్షల 53వేల 169 కుటుంబాలు ఉంటే.. ఏపీలో 32.18శాతం ఇళ్లకు కుళాయి సౌకర్యం ఉంది. అయితే గత ఐదేళ్లు పథకాన్ని సరిగా అమలు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం 2019-20 నుంచి 2024-25 వరకు ఈ పథకాన్నిఅమలు చేసేందుకు మొత్తం రూ.16,855 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,324 కోట్లు డ్రా చేసి రూ.2,316 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఏకంగా 71లక్షల 52వేల 326 ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించారని చెబుతున్నారు.. అంటే దాదాపు 75శాతం వరకు ఇళ్లకు కుళాయిలు అందుబాటులోకి వచ్చినట్లు లెక్క.తాజాగా కేంద్రం జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 24,00,843 ఇళ్లకు ప్రయోజ కనం కలగనుంది. ఈ ఇళ్లకు కూడా కుళాయి సౌకర్యం కల్పించే అవకాశం వచ్చింది. ఇప్పుడు ఈ పథకానికి సంబంధించి మిగిలిన నిధులతో.. మిగిలిపోయిన ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించను న్నారు. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు మాత్రమే 100శాతం గ్రామాల్లో ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించాయి.. మిగిలిన రాష్ట్రాల్లో పనులు జరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా చూస్తే ఏపీ 29వ స్థానంలో ఉంది. ఇప్పుడు పథకం కాలపరిమితి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో.. ఈ పనుల్ని మరింత వేగవంతం చేయనున్నారు.

## ఏపీలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

నెల్లూరురు ,: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో పౌర సేవల్ని త్వరగా అందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు ఫ్యామిలీ కార్డు (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానం అమలు చేయనున్నారు. అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో త్వరలోనే ఫ్యామిలీ కార్డు (స్మార్ట్ కార్డ్) విధానం తీసుకొస్తున్నామన్నారు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్. ఈ కార్డుతో సంక్షేమ పథకాలను అనుసంధానం చేస్తారని.. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్డుతో సూపర్ సిక్స్ పథకాలను కనెక్ట్ చేస్తామంటున్నారు. అలాగే రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేశామన్నారు పీయూష్ కుమార్.ఏపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొస్తోంది.. ఫ్యామిలీ స్మార్ట్ కార్డును జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డులో 26 అంశాలతో (ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్-రూరల్ ప్రాపర్టీ వంటి వివరాలు) డేటాబేస్ రూపొందించనున్నారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉండగా.. ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటా బేస్ సిద్ధం చేస్తామంటున్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా ప్లాన్ చేశారు అధికారులు. ఈ ఫ్యామిలీ కార్డును క్యూఆర్ కోడ్‌తో రూపొందించనున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఆ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలుస్తుంది.. కుటుంబానికి సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనలో భాగంగా ఈ ఫ్యామిలీ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించేందుకు, పౌర సేవలుకూడా సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# యువనేతలకు పోటీ చేసేదెక్కడ..!



నెల్లూరు: వైసీపీ 20 నెలలుగా అధికారం కోల్పోయామనే బాధ వెంటాడుతూనే ఉంది. మళ్లీ పవర్‌లోకి వస్తామా? ఫీల్డ్‌లోకి దిగి పనిచేస్తే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయో? లేదో? అనే డైలమా కంటిన్యూ అవుతోంది. ఓవైపు వైసీపీ లీడర్లు..క్యాడర్..డైలమాలో ఉంటే..కొన్ని చోట్ల టికెట్ ఫైట్ నడుస్తుంది. మరికొన్ని చోట్ల నడిపించే నాయకుడు లేక క్యాడర్ అయోమయంలో పడిపోయిందట. ఇక కొందరు ముఖ్యనేతల పరిస్థితి ఇంకా గమ్మత్తుగా ఉందట. పేరు గొప్పగా ఉన్నా చెప్పుకోవడానికి తమకంటూ ఓ నియోజకవర్గం లేకుండా పోయిందని మధన పడుతున్నారట.వైసీపీకి చెందిన పలువురు యువనేతలు అయితే అధినేత నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారట. గత ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేయాలని ఆదేశిస్తే అక్కడ పోటీ చేశాం. అప్పుడు అధికారం ఉంది గెలుస్తామనే ధీమా ఉండేది. ఇప్పుడు అపోజిషన్‌లో ఉన్నామ్. అసలే పరిస్థితులు బాలేవు. పైగా ప్రతిపక్షంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోయింది. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉన్నా జమిలి ఎలక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే త్వరగా ఏదో ఒక నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా నియమిస్తే వెళ్లి అక్కడ పనిచేసుకుంటామంటూ అర్జీలు పెట్టుకుంటున్నారు పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. అప్పటిలోగా రాజకీయంగా అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించే పరిస్థితిని ఫేస్ చేస్తున్నారట. తమకంటూ ఓ నియోజకవర్గం లేకుండా పోయిందన్న భావనలో ఉన్నారటవిజయవాడ తూర్పు నియోజకవర్గంలో దేవినేని అవినాష్ యువ నాయకుడిగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. కూటమిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ..బలమైన కౌంటర్ ఇస్తూ నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. పైగా కమ్మ సామాజికవర్గంలో అంతో ఇంతో మద్దతున్న నేత. కానీ వచ్చే ఎన్నికల్లో ఆయన ఎక్కడి నుంచే పోటీ చేస్తారు? అంటే..ఇప్పటికైతే నో క్లారిటీ. దీంతో ఆయన ఎటువైపు అడుగు వేయాలన్నది తేల్చుకోలేకపోతున్నారట. విజయవాడ ఎంపీగా పోటీ చేయాలని కొంతసేపు..కాదు పెనమలూరు నియోజకవర్గం ఇస్తామని మరోసారి..మచిలీపట్నం నుంచి పోటీ చేయించే యోచన అంటూ ఇంకోసారి లీకులు ఇస్తుండటంతో దేవినేని అవినాష్ సందిగ్ధంలో పడ్డారట.ఇక విజయవాడ పశ్చిమలో పోతిన వెంకట మహేష్, వెల్లంపల్లి శ్రీనివాస్ ఇద్దరిలో ఎవరికి టికెట్ ఇస్తారో తెలియని పరిస్థితి. అటు నెల్లూరు సిటీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అయితే సైలెంట్ మోడ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయనను నరసరావుపేట ఎంపీగా పోటీ చేయించారు. కానీ ఆయన అక్కడ ఓడిపోయారు.

దీంతో మళ్లీ తిరిగి తన సొంత నియోజకవర్గానికి వెళ్లాలనుకుంటున్నారు.కానీ అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన అడాల ప్రభాకర్‌రెడ్డి మళ్లీ టికెట్ ఆశించే అవకాశం ఉందంటున్నారు. దీంతో తిరిగి సొంత సెగ్మెంట్ నుంచి పోటీ చేయడంపై అనిల్‌కుమార్ యాదవ్‌కు అధిష్టానం నుంచి అభయం దక్కలేదంటున్నారు. అటు గుడివాడ అమర్‌నాథ్ తనను గాజువాక ఇంచార్జ్‌గా నియమించడంపై అసంతృప్తిగా ఉన్నారట.ఇలా గత ఎన్నికల్లో నియోజకవర్గాలు మార్చి అధిష్టానం మరో చోటు నుంచి పోటీ చేయించిన నేతలంతా పొలిటికల్ ఫ్యూచర్‌పై డైలమాలో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలనే దానిపై క్లారిటీ లేకపోవడంతో లైమ్‌లైట్‌లో ఉండేందుకు ఇష్టపడట్లేదట. ఏదో ఒక నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఇప్పటినుంచే పని చేసుకుం టూపోతేనే పట్టు సాధించే అవకాశం ఉంటుందని..లేకపోతే గత ఎన్నికల లాగా లాస్ట్ మూమెంట్‌లో నియోజకవర్గాలు మారిస్తే కష్టమే అంటున్నారు ఫ్యాన్ పార్టీ లీడర్లు. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు జగన్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారట. నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కీలక నేతలు పోటీ చేసే స్థానాలపై వైసీపీ అధినేత ఎప్పుడు డెసిషన్ తీసుకుంటారోనన్నది సస్పెన్స్‌గా మారింది.




## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థి ప్రింటర్ బహుకరణ..

ఏన్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు చదువుకున్న కళాశాల స్థితిగతులు ఏవిధంగా ఉంది, అని చూడటానికి వచ్చిన విద్యార్థికి కళాశాలలో ప్రింటర్ లేక ఇబ్బందులకు గురవుతున్నామని ప్రిన్సిపాల్ ద్వారా తెలుసుకున్న పూర్వ విద్యార్థి గంగవరపు రమేష్ ఆన్లైన్లో ప్రింటర్ ఆర్డర్ చేసి పదివేల రూపాయలు విలువగల ప్రింటర్‌ను ఆన్లైన్ ద్వారా అందజేశాడు. దీంతో కళాశాలకువచ్చిన ప్రింటర్‌ను జూనియర్ అసిస్టెంట్ యం.లావణ్య ప్రింటర్ను అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.సింహాచలం కోరిక మేరకు పూర్వ విద్యార్థి రమేష్ తక్షణమే ప్రింటర్ ఆన్లైన్ ద్వారా ఇప్పించడంతో కళాశాల సిబ్బంది,ఆధ్యాపక, ఆధ్యాపకేతర బృందం, పూర్వ విద్యార్థి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత 30 ఏళ్ల క్రితం చదువుకున్న కళాశాలను గుర్తుంచుకొని, తనకు చేతనైనంత రీతిలో స్పందించినందుకు పలువురు అభినందించారు.

# మళ్లీ గుడివాడ రాజకీయాల్లోకి నాని

విజయవాడ, : మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ రాజకీయాల్లోకి మళ్లీ ఎంట్రీ ఇచ్చారు. సుదీర్ఘ విరామం తర్వాత క్రియాశీల రాజకీయ కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. గతంలో కోర్టు వాయిదాలకు.. ముందస్తు బెయిల్ షరతుల్లో భాగంగా పోలీస్ స్టేషన్లలో సంతకాలు పెట్టడానికి వచ్చి వెళ్లిపోయేవారు. కానీ ఈ సారి రాజకీయ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కొడాలి నాని, గవర్నర్‌కు అందించే వినతిపత్రంలో సంతకం చేశారు. ఆ తర్వాత, వినతి పత్రాలను జిల్లా కమిటీకి అందించే పార్టీ శ్రేణుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ శ్రేణులతో కొడాలి నాని మాట్లాడారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలనే మంచి సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు పునాదులు వేశారని కొడాలి నాని తెలిపారు. వైసీపీ పాలనలో ఐదు కళాశాలలు పూర్తి అయ్యాయన్నారు. మరో ఐదు కళాశాలల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయని కానీ వాటిని పూర్తి చేయలేదన్నారు. పేద ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటల్స్ ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను అడ్డుకోవాలంటే మాజీ సీఎం జగన్ ప్రజలతో కలిసి పోరాటాన్ని మొదలుపెట్టారని కొడాలి వివరించారు. తమ ఉద్యమానికి ప్రజల నుంచి చక్కటి స్పందన వచ్చిందని కొడాలి నాని ప్రకటించారు. ప్రజల విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాభిష్టానికి అనుకూలంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ఉద్యమంలో తమ సేకరించిన వినతి పత్రాలను వైసీపీ అధినేత జగన్ నాయకత్వంలో గవర్నర్‌కు అందజేయనున్నట్లు మాజీ మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. కొడాలి నాని ప్రభుత్వం మారగానే తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారని అనుకున్నారు. కానీ ఆయన గుడివాడకు రాకుండా ఉండటంతో పాటు గుండెనొప్పితో ఆస్పత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకున్నారు. ముంబైలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. దీంతో ఆయన కోలుకోవడానికి సమయం పట్టింది. రెడ్ బుక్ లో మొదటి పేరు కొడాలి నానితే ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతూ ఉంటాయి. ఆయన వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల పాటు విపరీతమైన భాషను ఉపయోగించేవారు. ఇప్పుడు ఆయన పూర్తిగా ఆరోగ్యంగా ఉండటంతో..టీడీపీ క్యాడర్ కూడా రెడ్ బుక్ మళ్లీ రెడీ అవుతుందని నమ్ముతున్నారు .

# వివాదంలో దువ్వాడ శ్రీనివాస్ జంట?



హైదరాబాద్: లుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి జంట మరోసారి వార్తల్లోకి ఎక్కారు. అనుమతి లేకుండా మద్యం, హుక్కా పరికరాలతో పార్టీ చేసుకుంటున్నారనే సమాచారంతో ఈ ఆకస్మిక తనిఖీ జరిగిందని తెలుస్తోంది. ఈ ఘటనతో వీరిద్దరూ పోలీసుల అదుపులోకి వెళ్లినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురి జంట గురించి తెలియని వారుండరు. ఇక తాజాగా దివ్వెల మాధురి బిగ్‌బాస్ షోలో పాల్గొని,తన పాపులారి టీని మరింత పెంచు కుంది. ఈ లవ్‌బర్డ్స్ గురించి నిత్యం ఏదో వార్త వస్తూనే ఉంటుంది. ఈక్రమ ంలో తాజాగా దువ్వాడ శ్రీనివాస్,మాధురిలు వివాదంలో చిక్కుకున్నా రు. ఈ జంటను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మాధురి బర్త్‌డే సందర్భంగా మొయినాబాద్‌లోని ది పెండెంట్ ఫా మ్‌హౌస్‌లో పార్టీ నిర్వహించి... అనుమతి లేకుండా మద్యం తీసుకు ంటున్నారనే సమాచారంతో.. ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.డిసెంబర్ 12న దివ్వెల మాధురి పుట్టిన రోజు సందర్భం గా మొయినాబాద్‌లోని ది పెండెంట్ ఫామ్‌హౌస్‌లో దువ్వాడ శ్రీనివాస్ రాత్రి పార్టీ నిర్వహించారని తెలుస్తో ంది. అయితే ఈ పార్టీకి ఎలాంటి అనుమతి లేదని సమాచారం. అలానే పార్టీలో మద్యం తో పాటు మత్తు పదార్థాలు కూడా ఉన్నాయని వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పార్టీ గురించి స్థానిక పోలీసులకు, ఎస్ఓటీ పోలీసులకు అందిన పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌పై సంయుక్తంగా దాడి చేసి బర్త్‌డే పార్టీని భగ్నం చేశారు. ఎలాంటి అనుమతి లేని 10 విదేశీ మద్యం బాటిళ్లు, ఏడు హుక్కా పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తు తం పోలీసులు దువ్వాడ శ్రీనివాస్, దివ్వెల మాధురిలను అదుపు లోకి తీసుకున్నట్లు సమాచారం. 2024 లో ఆయన తన కుటుంబా న్ని విడిచిపెట్టి దివ్వెల మాధురితోకలిసి ఉంటున్నారు. టెక్కలిలోని దువ్వాడ నివాసం ముందు ఆయన భార్యాపిల్లలు ధర్నా చేయడంతో ఈ జంటవ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇకఅప్పటి నుంచి వీరిద్దరూ ఓపెన్‌గా తమ బంధం గురించి మాట్లాడుతున్నారు. బయట ఫంక్షన్లు, కార్యక్రమాలకు జంటగా కలిసే వెళ్తున్నారు.ఇదిలా ఉంటే.. బిగ్‌బాస్ 9 తెలుగుకి దివ్వెల మాధురి వైల్డ్‌కార్డ్ ఎంట్రీగా వెళ్లింది. ముచ్చటగా మూడు వారాల పాటు హౌస్‌లో ఉంది దివ్వెల మాధురి. మొదటి వారం ఆమెని ఎవరూ నామినేట్ చేయలేదు. ఇక రెండో వారం తనే తనూజతో డైరెక్ట్ నామినేషన్ చేయించుకొని, బిగ్‌బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అయి బయటికొచ్చేసింది. శివాజీకి ఇచ్చిన ఇంటర్వ్యూ,మరో యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ తెగ వైరల్ అయ్యాయి.

# గ్రేటర్ హైదరాబాద్ ఆఫీసులోనే నీళ్లు ల్లేవ్..?

హైదారబాద్: హైదరాబాద్‌ను విశ్వనగరంగా మారుస్తాం, ఇంటింటికీ 24 గంటల మంచినీరు ఇస్తాం అని ప్రగల్భాలు పలికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్దలకు.. సొంత ఆఫీసులో నీటి కష్టాలు తీర్చడం చేతకావడం లేదు. నగర ప్రజల దాహార్తిని తీర్చాల్సిన బల్దియా ప్రధాన కార్యాల యంలోనే గత రెండు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది.ట్యాంక్ బండ్ పక్కన ఠీవిగా కనిపించే ఈ పరిపాలనా భవనంలో బుధవారం మధ్యాహ్నం మొదలైన నీటి సమస్య గురువారం రాత్రి వరకు పరిష్కారం కాకపోవడంతో అధికారులు, సిబ్బంది, సందర్శకులు అల్లాడిపోయారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఏడవ అంతస్తు వరకు నీటి సరఫరా వ్యవస్థ కుప్పకూలింది. మోటార్లు మొరాయించాయో, పైపులైన్లు పగిలాయో తెలియదు కానీ కార్యాలయంలోని ఏ ఒక్క నల్లాలోనూ చుక్క నీరు రాలేదు. మేయర్ విజయలక్ష్మి, కమిషనర్, అదనపు కమిషనర్లు, విభాగాధిపతులు కొలువుదీరే భవనంలోనే 24 గంటలకు పైగా నీటి సరఫరా నిలి చిపో వడం బల్దియా పనితీరుకు అద్దం పడుతోంది. నీటి సరఫరా లేకపోవడంతోభవనంలోని వాష్‌రూమ్‌లు, టాయిలెట్లు అధ్వానంగా తయారయ్యాయి. నీళ్లు లేక ఫ్లష్‌లు పని చేయక, దుర్వాసన వెదజల్లుతుండటంతో కారిడార్లలో నడవడమే కష్టంగా మారింది. ముఖ్యంగా వందలాదిగా ఉన్న మహిళా ఉద్యోగులు వాష్‌రూమ్‌లకు వెళ్లలేక, బయటకు చెప్పుకోలేక నరకం అనుభవించారు.

అత్యవసర పరిస్థితు ల్లో పక్కనే ఉన్న వేరే భవనాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.నగర నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం, జనన మరణ ధృవీకరణ పత్రాల కోసం, టౌన్ ప్లానింగ్ పనుల కోసం హెడ్ ఆఫీసుకు వచ్చే సామాన్య జనం పరిస్థితి మరీ దారుణంగా ఉంది.దాహం వేస్తే మంచి నీళ్లు దొరక్క, టాయిలెట్లకు వెళ్లే దారిలేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఊరం దరికీ నీళ్లు పోస్తున్నామంటారు.. ఇక్కడేమో గొంతు తడుపుకోవడానికి కూడా దిక్కులేదు అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.సాధార ణంగా నగరంలో ఎక్కడ నీటి సమస్య వచ్చినా వాటర్ ట్యాంకర్లు పంపించే జీహెచ్ఎంసీ..

తన సొంత ఆఫీసులో నీళ్లు లేకపోతే ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయడంలో ఘోరంగా విఫలమైంది. బిల్డింగ్ మెయి ంటెనెన్స్ విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తిన ట్లు వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. సమస్య మొదలై 30 గంటలు దాటుతున్నా కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని నింపే ప్రయత్నం చేయలేదని ఆరోపిస్తున్నారు.

నీటి కొరత కారణంగా ఉద్యోగులు పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. బుధవారం, గురువారం మధ్యాహ్న సమయాల్లో లంచ్ చేద్దామంటే కనీసం చేతులు కడుక్కోవడానికి, ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి కూడా నీళ్లు లేని దుస్థితి నెలకొంది. చాలామంది సిబ్బంది తెచ్చుకున్న లంచ్ బాక్సు లను అలాగే వెనక్కి తీసుకెళ్లారు.

మరికొందరు ఆకలికి తట్టుకోలేక క్యాంటీన్లలో కొనుక్కున్న వాటర్ బాటిళ్ల నీటితో చేతులు కడుక్కుని భోజనం కానిచ్చారు. చిన్న చిన్న అవసరాలకు కూడా బయట నుంచి నీళ్లు కొనుక్కోవాల్సి రావడంతో సిబ్బంది తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

# రుణమాఫీతోనే తెలంగాణలోనే అప్పుల తక్కువ

హైదరాబాద్: ఏపీ,తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే తెలంగాణ రైతులకు తక్కువగా అప్పులు ఉన్నాయని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించి ంది. 2025 డిసెంబరు నాటికి తెలంగాణ రైతుల అప్పు రూ.1.75 లక్షల కోట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రూ.2 లక్షల రుణమాఫీ వల్లే ఈ లబ్ధి చేకూరిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. మరోవైపు, బహిరంగ మార్కెట్ రుణాల సేకరణలో తెలంగాణ రూ.69,300 కోట్లతో దేశంలోనే మూడో స్థానంలోనిలిచింది.ఏపీ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే.. తెలంగాణలో రైతులకు రుణభారం తక్కువగా ఉందట. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి పార్లమెం ట్‌లో వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో రైతులకు ఉన్న అప్పుల మొత్తంపై తమిళనాడు ఎంపీ ఎ.రాజా లోక్‌సభలో ప్రశ్న అడిగారు. ఆ ప్రశ్నకు ఆర్థికశాఖసహాయ మంత్రి పంకజ్ చౌధరి మం గళవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు.2025 డిసెంబరు 31 నాటికి తమిళనాడు అన్నదాతలపై రూ.5,0 6,290.45 కోట్లు, ఏపీ రైతులపై రూ.3,7 5,254.59 కోట్లు,కర్ణా టక రైతులపై రూ.2,10,244.47 కోట్ల అప్పుల భారం ఉందని వెల్లడించారు. ఇదే సమయంలో తెలంగాణ అన్నదాతలపై మాత్రం రూ.1,75,960.56 కోట్ల అప్పు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఇక బహిరంగ మార్కెట్ నుంచి రుణాల సేకరణలోతెలంగాణ ప్రభుత్వం మూడో స్థానంలో నిలిచిందని కేంద్రంస్పష్టం చేసింది. 2025-26ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసి కాల్లో తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.69,300 కోట్ల అప్పు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. రాష్ట్రాల రుణాలపై రాజ్యసభలో వైసీపీ సభ్యుడు గొల్ల బాబురావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు.మహారాష్ట్ర రూ.99 వేలకోట్లు, తమిళనాడు రూ.95 వేల కోట్లు తర్వాత మార్కెట్ నుంచి అత్యధిక మొత్తం రుణాలు సేకరించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో రాజస్థాన్ రూ.60 వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.56 వేల కోట్లు రుణాలుసేకరించినట్లు తెలిపారు.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో పలు విడతల్లో రుణామాఫీ చేసింది. దాదాపు 25 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశారు. అందుకు రూ.21 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేశారు. ఈ కారణంతోనే దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకు తక్కువ అప్పులున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అంటున్నారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్నారు.

# ఏఐతో భవిష్యత్తు..!

నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకురావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పురావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థంతో ఏ కంపెనీ లేదు. అలాగేమెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడిచిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీ కండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం..దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి.

ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పి చాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లు తుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు.


# రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్





ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందిందిఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మధనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకిమధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగన గా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు. నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమం ది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్‌గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లనుఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తనసినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియా లో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్ ని సాధించాడు.ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం

# వి. శాంతారామ్ బయోపిక్‌లో హీరోయిన్‌గా తమన్నా..



భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు, సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు, నిర్మాత అయిన దిగ్గజ చలనచిత్రకారుడు వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఆయన అద్భుతమైన సినీ ప్రయాణం ఆధారంగా బాలీవుడ్‌లో ఒక భారీ బయోపిక్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు ఆయన పేరునే 'వి. శాంతారామ్'గా ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టైటిల్ పాత్ర (వి. శాంతారామ్ పాత్ర)లో ప్రముఖ బాలీవుడ్ యువ నటుడు సిద్ధాంత్ చతుర్వేది నటించబోతుండగా.. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే మూవీ నుంచి సిద్ధాంత్‌చతుర్వేది ఫస్ట్ లుక్‌ని విడుదల చిత్రబృందం తాజాగా క థానాయికను పరిచయం చేసింది. ఈసినిమాలోహీరోయిన్‌గా తమ న్నానటించ బోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భం గా తమన్నా భాటియా ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది.

ఈ బయోపిక్‌ను రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే మరియు సరిత అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వి. శాంతారామ్ యొక్క అద్భుతమైన సినీ ప్రయాణాన్ని చూపించనుంది. సైలెంట్ యుగం (మూకీ సినిమాల కాలం) నుంచి టాకీలు (శబ్దంతో కూడిన సినిమాలు) ఆపై కలర్ సినిమా యుగం వరకు ఆయన చేసిన కృషి, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఘనమైన ప్రస్థానాన్ని ఈ చిత్రం తెరకెక్కించనుంది.

శాంతారామ్ సినీ ప్రస్థానం: 1901నవంబర్ 18, 1901లో మహారాష్ట్రలోనికోల్హాపూర్‌లో జన్మించిన వి.శాంతారామ్ 1921లో నటుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. అనంతరం నటనతో పాటు మొత్తం 55కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) లాంటి సంస్థలు స్థాపించి 92 సినిమాలకు పైగా నిర్మాతగా వ్యవహరించాడు. శాంతారామ్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అతడిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), పద్మవిభూషణ్ (1992 మరణానంతరం) లతో సత్కరించింది.

# అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!



ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్ ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.

నాని 'మజ్ను'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు. కానీ ఆ సినిమాలు మాత్రమే కాదు, ఆ తరువాత చేసినవి కూడా సరిగ్గా ఆడలేదు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఈ కోల కళ్ల భామ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అదృష్టం ఎదురుపడితే అమ్మడు తప్పుకుపోయిందా? లేదంటే అదృష్టమే తప్పించుకుని పోయిందా? అనేదే అభిమానులకు అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోయింది.

# పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే





టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరి సేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించ బోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిం ది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధిం చి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది.ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నా యి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా తెలియాల్సి ఉంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం. 12లో ధోని చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టిన రాధికా ఆప్టే ఆ తర్వాత కబాలి, బాలకృష్ణ లెజెండ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

# ఇక ఆషికా రంగనాథ్ ను ఆపడం కష్టమే!




వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం .. ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి కథానాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' .. తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే..



ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్సే లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్ తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.

Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343